
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY

5



శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

ఆదివారం 1 జూన్ 2025



రేషన్‌షాపును పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి జిలానీ బాషా

నేటి నుంచి దుకాణాల్లోనే రేషన్ పంపిణీ

పుట్టపర్తి, మే 31(ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీని సోమవారం నుంచి షాపుల్లోనే చేపడుతున్నట్లు పౌరసరఫరాల జిల్లా ప్రత్యేక అధికారి జిలాన్ బాషా పేర్కొన్నారు. డీఎస్ఓ వంశీకృష్ణారెడ్డితో కలిసి శనివారం ఆయన మున్సిపాలిటీలోని పలు రేషన్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ రేషన్‌షాపు బయట డీలర్ ఫొటోతో కలిగిన పోస్టర్‌ను అతికించాలన్నారు. ఆయా ప్రజాప్రతినిధులు రేషన్ పంపిణీలో పాల్గొనాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా 1367 షాపుల్లో రేషన్ పంపిణీని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. నాలుగైదు రోజుల్లోనే వందశాతం రేషన్ పంపిణీకి చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఇంకా ఓపెనే..

క్లోజ్ ఎప్పుడో..?

జోరుగా సాగుతున్న మట్కా

మట్కా మహమ్మారి పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలను సర్వనాశనం చేస్తోంది. పట్టీలు రాసే బీటర్లు మాత్రం లక్షలు సంపాదిస్తున్నారు. ఈ మట్కా హిందూపురం, మడకశిర, పెనుకొండ ప్రాంతాల్లో అధికంగా సాగుతున్నట్లు సమాచారం. వివిధ కంపెనీల పేరుతో 5, 6, 7 రోజుల ఆటంటూ నిర్వాహకులు మట్కాను నడుపుతున్నారు. ఇన్నాళ్లు చెట్లకింద, పట్టణ శివారు, బస్టాండు తదితర ప్రాంతాల్లో మట్కా రాసే బీటర్లు ప్రస్తుతం సెల్‌ఫోన్, ఇంటర్నెట్ సౌకర్యంతో మట్కా నిర్వహణను కొత్త పుంతలు తొక్కిస్తున్నారు.



- సహకరిస్తున్న కొందరు పోలీసులు
- రూ.లక్షలు దండుకుంటున్న బీటర్లు
- చితికిపోతున్న పేద ప్రజలు

హిందూపురం, మే 31(ఆంధ్రజ్యోతి): హిందూపురం, మడకశిర, పెనుకొండ ప్రాంతాల్లో ఎక్కువగా చిరు వ్యాపారులు, వలస కార్మికులు, కూలీలు ఉన్నారు. వీరు పగలంతా కష్టపడి సంపాదించిన సొమ్మును సాయంత్రం అయ్యేసరికి మట్కా బీటర్లు దోచేస్తున్నారు. కూలీల వద్దేకే కొంతమంది బీటర్లు వెళ్లి డబ్బులు కట్టించుకుంటున్నట్లు సమాచారం. మట్కా ఊబిలోపడి చాలా కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. అప్పుల భారంతో గ్రామా లు వదిలినవారుకూడా ఉన్నారు. అయితే మట్కా నియంత్రించాల్సిన పోలీసుశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. కొందరు కిందిస్థాయి సిబ్బంది మామూళ్ల మత్తులోపడి మట్కా నిర్వాహకులు, బీటర్లకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. హిందూపురం పట్టణంలోని పరిగి బస్టాండు, చిన్నమార్కెట్, నింకంపల్లి, హౌసింగ్‌బోర్డు, శ్రీకంఠపురం, మోడల్‌కాలనీ నూతనంగా ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్, హస్నాబాద్, చౌడేశ్వరికాలనీ, ముద్దిరెడ్డిపల్లి, కొట్నూరు ప్రాంతాల్లో అధికంగా మట్కా సాగుతున్నట్లు

(మిగతా 6లో...)

వెన్నుపోటు గురించి జగన్ మాట్లాడటమా..?

- దోచుకోవడం, దాచుకోవడం వైసీపీకే చెల్లు
- బీసీ సంక్షేమ శాఖమంత్రి సవిత



నారనాగేపల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి

హిందూపురం(రొద్దం), మే 31(ఆంధ్రజ్యోతి): కన్నతల్లి, సొంత చెల్లినే మోసం చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి వెన్నుపోటు గురించి మాట్లాడే అర్హత లేదని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత విమర్శించారు. రొద్దం మండలంలోని నారనాగేపల్లి గ్రామంలో వృద్ధులు, వికలాంగులకు శనివారం ఆమె పించన్లు పంపిణీ చేశారు. జూన్ నాలుగో తేదీన వెన్నుపోటు దినోత్సవమని వైసీపీ ప్రకటించడంపై మంత్రి మండిపడ్డారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి మద్యం, ఇసుక, మట్టి తవ్వకాలలో కోట్లు కొల్లగొట్టి దోచుకోవడం, దాచుకోవడం వైసీపీకే చెల్లిందన్నారు. రూ.2వేలు పింఛన్‌ను రూ.3వేలు చేసేందుకు వైసీపీ ప్రభుత్వానికి ఐదేళ్లు పట్టిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.3వేల పింఛన్ రూ.4వేలకు వికలాంగులకు రూ.6వేలు, అనారోగ్య బాధితులకు రూ.15వేలకు పెంచి మాట నిలబెట్టుకున్నారన్నారు. జూన్‌లో తల్లికి వందనం, ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతన్నలకు త్వరలోనే అన్నదాత సుఖీభవ అందిస్తామన్నారు. రొద్దం మండలానికి 73సీసీరోడ్లు మంజూరు చేశామన్నారు. కల్లూరు రోడ్డులో రూ.2.80కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతుండగా మరో రూ.2కోట్లు మంజూరు చేస్తామన్నారు. పెద్దగువ్వలపల్లి నుంచి కల్లుకుంట రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. పెద్దకోడిపల్లి నుంచి నారనాగేపల్లికి 1.32కోట్లు డీఆర్ కొట్టాల గ్రామానికి బ్రిడ్జి నిర్మాణానికి 1.30కోట్లు, రాచూరు గ్రామానికి ఓహెచ్ఆర్ ట్యాంకుకు రూ.25లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నారానాగేపల్లి గ్రామానికి రూ.15లక్షలతో సీసీ రోడ్డు మంజూరైందన్నారు. గౌరాజుపల్లిలో సబ్‌స్టేషన్‌కు త్వరలో భూమిపూజ చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయ్ శంకర్‌రాజు, ఎంపీడీఓ రాంకుమార్, ఇరిగేషన్ జేఈ వినోద్‌కుమార్, హౌసింగ్ ఏఈ ఖాజా మోయినుద్దీన్, టీడీపీ నాయకులు మాధవనాయుడు, చిన్నప్పయ్య, చంద్రమౌళి, రామక్రిష్టప్ప, నరహరి, జిల్లా బీసీసెల్ కార్యదర్శి వీరాంజనేయులు, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు హరీ, మాజీ వైస్ ఎంపీపీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

కదిరి, మే 31(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మహిళపై లైంగిక దాడి చేసిన ఎన్పీకుంట మండలం గంగిరెడ్డులవారిపల్లికి చెందిన హరిప్రసాద్ రెడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో కాంట్రాక్టు విద్యుత్ లైన్‌మన్‌గా పనిచేస్తున్నారు. భర్తకు దూరంగా ఉంటున్న ఓ మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు లైంగిక దాడి చేశాడు. గర్భందాల్చిన ఆమె.. పెళ్లి చేసుకోవాలని కోరగా, హరిప్రసాద్‌రెడ్డి నిరాకరించాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోర్టు నిందితుడికి 15 రోజుల రిమాండ్ విధించిందని సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

ప్రమోషన్లలో అన్యాయం

> ఇంగ్లిష్ ఎస్‌జీటీల ఆవేదన
> అధికారుల తీరుపై విమర్శలు
> ఆందోళనలకు సిద్ధమని ప్రకటనలు
> కౌన్సెలింగ్‌ను అడ్డుకుంటామంటూ హెచ్చరికలు

కొత్తచెరువు, మే31(ఆంధ్రజ్యోతి): అన్ని సబ్జెక్టుల టీచర్లకు ప్రమోషన్లు ఇచ్చిన విద్యాశాఖాధికారులు తమకు మాత్రం తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఇంగ్లిష్ ఎస్‌జీటీలు మండిపడుతున్నారు. ఉమ్మడి జిల్లాకు డీఎస్సీలో 103 ఖాళీలను విద్యాశాఖాధికారులు చూపుతున్నారు. నిబంధనల ప్రకారం ప్రమోషన్లు ఇచ్చిన తరువాత ఖాళీలు చూపాల్సి ఉంటుందని టీచర్లు అంటున్నారు. 19 మాత్రమే ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ ఖాళీలు చూపించడం ఏంటని ఎస్‌జీటీలు.. విద్యాశాఖాధికారుల తీరును ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వం 233 మంది ఇంగ్లిష్ సబ్జెక్టు టీచర్లకు ప్రమోషన్లు ఇచ్చింది. ఆ మేరకు జీఓను సైతం విడుదల చేసింది. ప్రమోషన్ పొందిన ఇంగ్లిష్ టీచర్లకు నెలకు రూ.2,500 అదనంగా ఇచ్చి నాలుగు నెలలపాటు పనిచేయించింది. తరువాత వారిని యథాస్థానానికి పంపింది. దీనిపై సర్వత్రా విమర్శలు వినిపించాయి.

ప్రమోషన్ లేకుండానే రిటైర్మెంట్..!

ఉద్యోగంలోకి చేరినప్పటి నుంచి ఒక్క ప్రమోషన్ కూడా తీసుకోకుండానే ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనేకమంది టీచర్లు రిటైరవుతున్నారు. తమకు కూడా అదే పరిస్థితి వచ్చేలా ఉందని ఇంగ్లిష్ ఎస్‌జీటీలు వాపోతున్నారు. అధికారుల తప్పిదం వల్లే ప్రమోషన్లు కోల్పోతున్నామని వారు వాపోతున్నారు. ప్రమోషన్లపై పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదంటున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రమోషన్లలో న్యాయం చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రమోషన్లు ఇవ్వకపోతే కౌన్సెలింగ్‌ను అడ్డుకుంటామని వారు హెచ్చరిస్తున్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కొత్తచెరువు, మే 31(ఆంధ్రజ్యోతి): ఆర్‌జీయూకేటీ(రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్) ట్రిపుల్‌ఐటీ ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించినట్లు విద్యాశాఖ ఏడీ లాజర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 10 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు.

పదో తరగతిలో రీకౌంటింగ్, రీవాల్యూయేషన్ చేసుకున్న విద్యార్థుల కోసం ప్రభుత్వం ఈ గడువును పొడిగించిందని ఆయన తెలిపారు. దరఖాస్తు చేయని విద్యార్థులు జూన్ 2న ఉదయం 10గంటల నుంచి 10 సాయంత్రం 5గంటల వరకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఆర్‌జీయూకేటీ. ఇన్ వెబ్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు.

తప్పనిసరిగా కదల్లేదు..!

- ఐదేళ్లు దాటినా అక్కడే తిష్ట
- జడ్పీ బదిలీల్లో మాయాజాలం
- చక్రం తిప్పిన యూనియన్ నాయకులు, అధికారులు

7

ఆశల ఆకాశం..

నేటి నుంచి ఖరీఫ్ సీజన్

- 80 శాతం దుక్కులు పూర్తి
- పదును వర్షం కోసం అన్నదాతల ఎదురుచూపు
- చినుకు పడితే విత్తుకు రెడీ..!
- ఈసారి ముందస్తుగానే జిల్లాకు నైరుతి



● గుత్తి రూరల్ మండలం గొందిపల్లి వద్ద విత్తనం వేసేందుకు సిద్ధం చేసిన పొలం

అనంతపురం అర్బన్/గుత్తిరూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల ఆగమనం, వర్షాలు, దుక్కులు అన్నీ ఈ ఏడాది ముందస్తుగానే జరిగాయి. విత్తనం వేసేందుకు రైతు సిద్ధంగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో అన్నదాతల ఆశల సీజన్ ఖరీఫ్ కూడా వచ్చేసింది. ఆదివారం ప్రారంభంకానుంది. దీంతో మళ్లీ వర్షం కురిస్తే విత్తనం వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఏటా జూన్ 1న ఖరీఫ్ సీజన్ ప్రారంభమై సెప్టెంబరు నెలాఖరుతో ముగిసేది. ఖరీఫ్‌లో జిల్లాలోని మెట్ట భూముల్లో వర్షాధారం కింద ప్రధాన పంటగా వేరుశనగ సాగు చేస్తున్నారు. ఈ ఏడాది జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 3.43 లక్షల హెక్టార్లుగా నిర్ణయించారు. ఇందులో వేరుశనగ 1.82 లక్షలు, కంది 55,296, పత్తి 44 వేలు, (మిగతా 6లో..)

సచివాలయ సేవలు దూరం..!

- పనిచేయని ప్రింటర్లు
- పేపర్లు లేవంటున్న డిజిటల్ అసిస్టెంట్లు
- పట్టించుకోని పంచాయతీ కార్యదర్శులు
- ధ్రువ పత్రాల కోసం లబ్ధిదారులకు ఇబ్బందులు





సోమయాజులపల్లిలో పని చేయని ప్రింటర్, అందుబాటులో లేని ధ్రువీకరణ పత్రాలు



ప్రింటర్ పనిచేయక వెనుదిరుగుతున్న రైతులు

గాండ్లపెంట, మే 31(ఆంధ్రజ్యోతి): గ్రామీణులకు అన్ని సేవలు అందుబాటులో ఉంచాలన్న లక్ష్యంతో సచివాలయాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆశయానికి అధికారులే తూట్లు పొడుస్తున్నారు. ఆయా గ్రామ సచివాలయాల్లో అందించే ధ్రువీకరణ పత్రాలే కీలకం. పంచాయతీలోని లబ్ధిదారులకు కులం, నివాసం, ఆదాయం, జనన, మరణ, వన్‌బీ, అడంగల్ తదితర ధ్రువీకరణ పత్రాలు సచివాలయాలలో అందించాలని ప్రభుత్వ ఉద్దేశ్యం. సచివాలయాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. పత్రాలు కూడా అందుబాటులో లేవని డిజిటల్ అసిస్టెంట్లు చెబుతున్నారు. దీంతో లబ్ధిదారులు ప్రైవేటు మీసేవల ద్వారా ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నారు. ప్రభుత్వం సచివాల ఉద్యోగులను నియమించి, వారికి జీతాలు చెల్లిస్తున్నా ప్రజలకు సేవలు అందించడంలో విఫలమవుతున్నారు. దీంతో సచివాలయ సేవలు లబ్ధిదారులకు దూరమవుతున్నాయి.

నిత్యం ప్రింటర్ల మరమ్మతులే..

గాండ్లపెంట మండలంలోని 14 పంచాయతీల్లో దాదాపు 15వేల కుంటుబాలు ఉన్నాయి. గాండ్లపెంట, వేపరాల, కురుమామిడి, మల్లమీదపల్లి, సోమయాజులపల్లి, కటారుపల్లి, గొడ్డువెలగలలో సచివాలయాలు ఏర్పాటు చేశారు. సోమయాజులపల్లి, గాండ్లపెంట, కురమామిడి ప్రింటర్లు నెలరోజుల నుంచి పని చేరయడంలేదు. మల్లమీదపల్లిలో వారం రోజులుగా డిజిటల్ అసిస్టెంట్ సెలవులో ఉన్నారు. గొడ్డువెలగలలో నెట్‌వర్క్ లేకపోవడంతో డిజిటల్ సేవలు అంతంతమాత్రమే అందుతున్నాయి. ప్రస్తుతం రైతులు రుణాలు రెన్యువల్ చేయించుకోవడానికి వన్‌బీ, అడంగల్ అవసరం. సచివాయాల్లో ప్రింటర్లు మరమ్మతులకు గురికావడంతో ధ్రువీకరణ పత్రాలు ప్రైవేట్ మీ సేవల్లో అధిక ధరలు ఇచ్చి తీసుకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ప్రింటర్ల మరమ్మతులను పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోకపోవడంతో సచివాలయ సేవలు ప్రజలకు దూరమవుతున్నాయి. జూన్ నెల నుంచి విద్యాసంవత్సరం ప్రారంభంకానున్నంది. విద్యార్థులకు కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ అవసరమవుతాయి. వాటి కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

రెన్యువల్‌కు ఇబ్బందులు



ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో బ్యాంకు రుణాలు రెన్యువల్ చేసుకోవాలంటే వన్‌బీ, అడంగల్ అవసరం. వాటి కోసం సచివాలయాల్లోకి వెళితే ప్రింటర్లు పనిచేయలేదంటున్నారు. దీంతో ఎక్కువ ఖర్చుపెట్టి ప్రైవేటు మీసేవల్లో పత్రాలు తీసుకోవాల్సి వస్తోంది. సచివాలయాల్లో రైతులకు సేవలు అందించడానికి ఉద్యోగులను నియమించినా ప్రింటర్లు పనిచేయకపోవడంతో సేవలు అందడంలేదు.

-సాంబశివారెడ్డి, రైతు, వద్దిరెడ్డిపల్లి

ప్రింటర్లకు మరమ్మతులు చేయిస్తాం

గాండ్లపెంట మండల పరిధిలోని వివిధ గ్రామ పంచాయతీల్లో కొన్నిచోట్ల ప్రింటర్లకు మరమ్మతులు వచ్చాయి. ఆయా పంచాయతీ కార్యదర్శులతో చర్చించి మరమ్మతులు చేయిస్తాం. లబ్ధిదారుల సేవలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం.

-సునీత, ఈఓఆర్డీ

సీలింగ్‌ను మించి..!

- ఇష్టారాజ్యంగా ఓల్డ్ స్టేషన్ పాయింట్లు
- 8 ఏళ్ల సీలింగ్‌కు 24 పాయింట్లు ఫైనల్
- చాలామందికి 29, 39, 40 పాయింట్లు కూడా..
- మరికొందరికి రేషనలైజేషన్ పాయింట్లు సైతం
- సరిదిద్దని ఎంఈఓలు, సిబ్బంది
- అర్హులకు అన్యాయం జరిగే చాన్స్..!

6



ధర్మం



బుద్ధిలేని పనులు..!

అసభ్య పదజాలంతో ఆకాశరామన్న లేఖలు

సీఎం, మంత్రి సంతకాల ఫోర్జరీ..

కేసు నమోదు

సహకార శాఖలో కొందరు ఉద్యోగుల వికృత చేష్టలు



జిల్లా సహకార శాఖ అధికారి కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, మే 31(ఆంధ్రజ్యోతి): కొందరు ఉద్యోగుల తీరుతో సహకార శాఖ పరువు బజారున పడింది. అసభ్యకర పదజాలంతో ఒకరిపై ఒకరు ఆకాశ రామన్న లేఖలు రాయడం కలకలం రేపుతోంది. మహిళ, పురుష ఉద్యోగులపై పరస్పర లేఖలు రాసుకుంటూ ప్రభుత్వ శాఖలకు ఉన్న గౌరవాన్ని దిగజారుస్తున్నారు. సీఎం, మంత్రి సంతకాలను సైతం ఫోర్జరీ చేసి సృష్టించిన సిఫారసు లేఖలు శాఖలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. వీటిపై ఇటీవల నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో జిల్లా సహకార శాఖ అధికారి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నెల రోజులు గడుస్తున్నా చర్యల విషయంలో ఒక్క అడుగుకూడా ముందుకు పడలేదు. ఈ లేఖలకు ఎవరు బాధ్యులనే అంశాన్ని తేల్చలేకపోతున్నారు. సహకార శాఖలో ఉద్యోగులకు చేతినిండా పని లేక అసభ్యకర పదజాలంతో పరస్పరం ఆకాశరామన్న లేఖలు రాసుకుంటూ శాఖ ప్రతిష్ఠను దిగజారుస్తున్నారనే ఆవేదన సర్వత్రా వ్యక్తం అవుతోంది. వైసీపీ పాలనలో ఈ దుష్ట సంప్రదాయం మొదలైంది. అసలు పనికి స్వస్తి పలికిన కో ఆపరేటివ్ శాఖ ఉద్యోగులు కొసరు పనుల్లో బిజీ అయ్యారు.

నష్టాలతో మూతపడుతున్న సొసైటీలు

నాబార్డు నుంచి ఆప్కాబ్, ఆప్కాబ్ నుంచి ఏడీసీసీ బ్యాంకు, బ్యాంకు నుంచి సొసైటీలకు, సొసైటీల నుంచి రైతులకు రుణాలు ఇస్తారు. ఇచ్చిన రుణాలు ప్రతి ఏటా సక్రమంగా రైతులు రెన్యువల్ చేసుకునేలా, లావాదేవీలు సక్రమంగా నిర్వహించేలా చూడాల్సిన బాధ్యత బ్యాంకు, సొసైటీ ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన సహకార శాఖ అధికారులు తమకేమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఉన్న 108సొసైటీల్లో 70కి పైగా సొసైటీలు సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేని దుస్థితిలో ఉండిపోయాయి. జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉన్న కూడేరు సొసైటీలో లావాదేవీలు నిలిపివేయడం, సిబ్బందికి జీతాలు ఇవ్వలేక మూతపడింది. ఉమ్మడి జిల్లాలో సుమారు 30సొసైటీలు కోలుకోలేని నష్టాల్లో కూరుకుపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో సొసైటీలను బలోపేతం చేయడం విస్మరించిన సహకార శాఖ అధికారులు కొసరు పనుల్లో నిమగ్నమవ్వడం విమర్శలకు దారితీస్తోంది.

చుట్టపు చూపుగా మారిన పీఐసీ

గతేడాదిగా ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్‌లకు పాలకవర్గాలు లేవు. జిల్లా జాయింట్ కలెక్టర్‌ను బ్యాంకుతోపాటు డీసీఎంఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జిగా (పీఐసీ)గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. సహకార శాఖ అధికారులను సమన్వయం చేసుకుని ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్ పరిధిలోని సొసైటీలను బలోపేతం చేయడానికి పీఐసీ కీలకపాత్ర వహించాలి. అయితే ఏడాది కాలంలో పీఐసీ కేవలం అరకొర సమావేశాలతోనే గడిపారు. ఆత్మకూరు బ్రాంచ్ పరిధిలో నకిలీ పట్టాలకు సుమారు రూ.20లక్షల రుణాలు చెల్లించిన ఘటనలో విచారణ అధికారి నివేదిక ఇచ్చి 20రోజులు గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సొసైటీల అభివృద్ధిలో పీఐసీ పాత్ర, పర్యవేక్షణే ప్రధానం. అయితే ఇందుకు భిన్నంగా వ్యవహారం నడుస్తోంది.

ఆ బాధ్యత ఉద్యోగులదే...



సహకార సొసైటీలను, వ్యవస్థను బలోపేతం చేసి గ్రామీణ ప్రాంతాల్లో పేదలు, రైతులకు సేవలందించాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉంది. ఎవరికి కేటాయించిన విధులను వారు సమర్థవంతంగా నిర్వహించి సొసైటీలను అభివృద్ధి చేయాలి. కంప్యూటరైజేషన్ పూర్తయిన సొసైటీలను నష్టాల నుంచి లాభాల బాటలోకి తెచ్చే ప్రయత్నాలు ముమ్మరంగా జరగాలి. లావాదేవీలు అన్నీ ఆన్‌లైన్‌లోనే జరగాలి. డిపార్ట్‌మెంట్‌లో జరుగుతున్న అసభ్యకర పదజాలంతో కూడిన ఆకాశరామన్న లేఖలు, సంతకాల ఫోర్జరీలపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నిజాలను నిగ్గు తేల్చాల్సిన బాధ్యత పోలీసులదే.

-అరుణకుమారి, జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ)

ఇంకా ఓపెనే.. క్లోజ్ ఎప్పుడో..?

(5వ పేజీ తరువాయి)

తెలుస్తుంది. అలాగే పెనుకొండ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు, అనంతపురం వెళ్లే రహదారిలో ఉన్న కొన్ని బంకుల్లో, కోటకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో మట్కా బీటర్లు కొంతమంది పట్టీలు రాస్తున్నట్లు తెలిసింది. మడకశిరలో కొంతమంది పోలీస్ సిబ్బంది మట్కాకు సహకరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. హిందూపురం పరిధిలో లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో కూడా మట్కా సాగుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా సోమందేపల్లి, గోరంట్ల, పరిగిలో కూడా చాపకింద నీరులా మట్కా విస్తరించింది.

సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు

ప్రస్తుతం చాలా మంది బీటర్లు సెల్‌ఫోన్, ఇంటర్నెట్ ద్వారా మట్కా నిర్వహిస్తున్నారు. మరికొంతమందైతే యాప్‌లు రూపొందించి అందులోనే మట్కా ఆడుతూ చెల్లింపులు కూడా చేస్తున్నట్లు తెలిసింది. వాణిజ్యకేంద్రంగా పేరుగాంచిన హిందూపురం ప్రాంతంలో సాంకేతిక పరిజ్ఞానంతో యాప్‌లు రూపొందించి ఎక్కువగా మట్కా ఆడుతున్నట్లు సమాచారం. ఒకప్పుడు మట్కా పట్టీలు బీటర్లురాసి దానిని నిర్వాహకుల కేంద్రం వరకు తీసుకెళ్లేవారు. అలాగే మరుసటి రోజు ఉదయం ఒకవేళ ఎవరికైనా నంబరు తగిలితే అక్కడికి వెళ్లి డబ్బులు తీసుకొచ్చి ఇచ్చేవారు. కానీ ప్రస్తుతం ఆన్‌లైన్ లావాదేవీలు కావడంతో బీటరు ఇంటి నుంచే పంపే సౌకర్యం అందుబాటులో ఉంది. దీనివల్ల కొంతమంది మట్కా బీటర్లను గుర్తించేందుకు పోలీసులకు ఇబ్బంది ఎదురవుతోంది.

నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

మట్కా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు కూడా దీనిపై ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నాం. సైబర్ క్రైమ్ సహకారంతో ఆన్‌లైన్ మట్కా యాప్‌లపై కూడా దృష్టిసారిస్తాం. పేద, మధ్యతరగతి కుటుంబాలు మట్కాకు అలవాటుపడితే జరిగే నష్టాలు తెలుసుకుని వ్యసనానికి దూరంగా ఉండాలి. మట్కా నిర్వాహకులు, బీటర్లకు మా సిబ్బంది సహకారం ఉన్నట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. -మహేష్, డీఎస్పీ

పర్యావరణంపై విద్యార్థులకు పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు మూడు అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అధికారి బీవై మునిప్రసాద్ శనివారం ప్రకటనలో తెలిపారు. 'భూమిని రక్షించడంలో నేను ఎలా సహాయపడగలను' అనే అంశంపై 2న సైన్స్ సెంటర్‌లో, 3న ఆర్ట్స్ కాలేజీ, 4న ఎస్కే యూనివర్సిటీ సమీపంలోని రైపర్ కళాశాలలో వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు ఉంటాయన్నారు. వివరాలకు 9866776728 నంబరులో సంప్రదించాలని కోరారు.

సీలింగ్‌ను మించి..!

- ఇష్టారాజ్యంగా ఓల్డ్ స్టేషన్ పాయింట్లు
- 8 ఏళ్ల సీలింగ్‌కు 24 పాయింట్లు ఫైనల్
- చాలామందికి 29, 39, 40 పాయింట్లు కూడా..
- మరికొందరికి రేషనలైజేషన్ పాయింట్లు సైతం
- ఎడిట్ చేయని ఎంఈఓలు
- అర్హులకు అన్యాయం జరిగే చాన్స్..!

అనంతపురం విద్య, మే 31(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల్లో ఓల్డ్‌స్టేషన్ పాయింట్లు ఇష్టారాజ్యం వేసుకున్నారు. ఒక స్టేషన్‌లో 8 ఏళ్లకు మించి ఎన్ని సంవత్సరాలు పనిచేసినా... 24 పాయింట్లు ఇవ్వడమే ఫైనల్. 9 ఏళ్లు, 10 ఏళ్లు పనిచేసినా... 8 ఏళ్లకు ఏడాదికి 3 పాయింట్లు చొప్పున 24 పాయింట్లు మాత్రమే వేయాలి. 8 ఏళ్లకు సీలింగ్ పెట్టారు కాబట్టి... ఏ లాంగ్ స్టాండ్ టీచర్‌కు అయినా ఓల్డ్‌స్టేషన్ 24 పాయింట్లు మాత్రమే వేయాలి. కొందరికి 29.0517, మరి కొందరికి 39, ఇంకొందరికి 40 పాయింట్లు కూడా వేశారు. శనివారం విడుదలైన ఎస్‌జీటీల ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాలో ఈ డొల్లతనం బట్టబయలైంది. ఎన్ని పాయింట్లు పడినా... సీలింగ్ నిబంధనకు 24కి కుదించేలా విద్యాశాఖ.. ఎంఈఓలకు అధికారం ఇచ్చింది. ఎంఈఓల నిర్లక్ష్యంతో కిందిస్థాయి సిబ్బందికి వదిలేయడం వల్ల ఎడాపెడా కొట్టేయడంతో ఓల్డ్ స్టేషన్ పాయింట్లు భారీగా వచ్చాయి. దీని వల్ల అర్హులైన సీనియర్ టీచర్లకు అన్యాయం వాటిల్లే ప్రమాదం ఉంది.

వందలాది మందికి ఇలాగే పాయింట్లు...

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వందలాది మంది టీచర్లకు ఇలాగే పాయింట్లు పడ్డాయి. తనకల్లు మండంలో పనిచేసే ఇద్దరు టీచర్లకు 39.051 పాయింట్లు వేశారు. పెనుకొండ డివిజన్‌లో మరో ఇద్దరికి 39, బుక్కరాయసముద్రంలో ఒకరికి 30, తనకల్లు మండలంలోని మరో స్కూల్‌లో పనిచేసే టీచర్‌కు 40, పెద్దపప్పూరు మండలంలో ఓ లేడీ టీచర్‌కు 29.0517 పాయింట్లు పడ్డాయి. ఇలా వందలాది మంది ఎస్‌జీటీలకు 24 పాయింట్లకు అదనంగా ఓల్డ్ స్టేషన్ పాయింట్లు పడటం విమర్శలకు తావిస్తోంది. జిల్లాలో బీకేఎస్, కూడేరు, బెలుగుప్ప, పెద్దపప్పూరు, బత్తలపల్లి, విడపనకల్లు, ముదిగుబ్బ, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, హిందూపురం, తాడిపత్రి, యాడికి, లేపాక్షి, కుందుర్పి, శింగనమల మండలాల్లో చాలా ఉన్నట్లు స్పష్టమవుతోంది. కొందరు టీచర్లకు ఓల్డ్ స్టేషన్ పాయింట్లతోపాటు రేషనలైజేషన్ పాయింట్లు కూడా పడ్డాయి. దీంతో 40 పాయింట్లు కూడా దాటిన టీచర్లు కుప్పలు..తెప్పలుగా ఉన్నారు. తద్వారా సీనియర్ల కంటే జూనియర్లకు అధికంగా పాయింట్లు రావడంతో సీనియారిటీలో ముందుకు చేరారు. ఫలితంగా సీనియర్లకు అన్యాయం జరుగుతోంది.

ఎంఈఓల నిర్లక్ష్యం

ఉపాధ్యాయుల ఆన్‌లైన్ దరఖాస్తుల ఎడిట్‌కు విద్యాశాఖ గతంలో అవకాశం ఇచ్చింది. ఎవరైనా టీచర్ ఓల్డ్ స్టేషన్ పాయింట్లు ఎక్కువగా వేసుకున్నా... టెక్నికల్ సమస్య కారణంగా అధికంగా యాడ్ అయినా... వెంటనే ఎంఈఓలు సరిచేయడానికి అవకాశం ఉంది. ఎంఈఓలు పట్టించుకోకపోవడంతోపాటు, కొందరు టీచర్లు సైతం తమకు అదనంగా వచ్చిన పాయింట్లను చూసుకుని తమకే మేలు అంటూ అలాగే ఉండటం వల్ల చాలా మందికి 24 పాయింట్ల కంటే ఎక్కువగా పడ్డాయి. ఎడిట్ అవకాశం ఉన్నా... మండల విద్యాశాఖాధికారులు ప్రేక్షకపాత్ర పోషించడం విమర్శలకు తావిస్తోంది. వందలాదిమందికి సీలింగ్ పాయింట్ల కంటే ఇలా అదనంగా ఓల్డ్ స్టేషన్ పాయింట్లు పడటంతో అర్హులు, సీనియర్లకు అన్యాయం జరుగుతోంది. డీఈఓ దీనిపై దృష్టి సారించకుంటే చాలామంది సీనియర్లు నష్టపోయే ప్రమాదం ఉంది.

ఆశల ఆకాశం..

(5వ పేజీ తరువాయి)

ఆముదం 16,293, వరి 19,466, జొన్న 1,719, సజ్జ 2,054, మొక్కజొన్న 14,653, రాగి 69, కొర్ర 3,311, పెసలు 455 హెక్టార్లు, మిగతా విస్తీర్ణంలో ఉలవలు, మినుములు, అలసంద తదితర రకాల పంటలుసాగవనున్నాయి.



గుత్తి రూరల్ మండలం గొందిపల్లిలో సిద్ధం చేసుకున్న వేరుశనగ విత్తనాలు

80 శాతం దుక్కులు పూర్తి

ఈసారి మే నెలలో కురిసిన వర్షాలకు జిల్లాలోని మెట్టభూముల్లో 80 శాతం దాకా దుక్కులు పూర్తయ్యాయి. దుక్కులు దున్నుకున్న తర్వాత వర్షం పడితే నేరుగా విత్తనం వేసుకునేందుకు అనుకూలం. దుక్కులు చేసుకున్న ప్రాంతాల్లో మరోమారు వర్షం పడితే విత్తనం వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ఖరీఫ్ సీజన్‌లో జూన్ 15 నుంచి జూలై 15 వరకు వేరుశనగ విత్తనం విత్తుకునేందుకు అదును సమయంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆ సమయంలో విత్తనం వేసుకుంటే దిగుబడులు బాగుంటాయని స్పష్టం చేస్తున్నారు. జూన్ 8వ తేదీ మృగశిర కార్తె ప్రారంభం కానుంది. ఇప్పటికే కొందరు రైతులు బహిరంగ మార్కెట్‌లో విత్తన వేరుశనగను కొనుగోలు చేసుకోగా.. మరికొందరు సబ్సిడీ విత్తన కాయల కోసం ఎదురుచూస్తున్నారు.

ముందస్తుగానే నైరుతి ప్రవేశం

జిల్లాలోకి ఈ ఏడాది మే 26వ తేదీ ఉదయం నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. గత ఏడాదితో పోలిస్తే ముందస్తుగానే ఈసారి వచ్చాయి. గతేడాది మే 29వ తేదీ కేరళకు... జూన్ 2న జిల్లాలోకి ప్రవేశించాయి. ఈ ఏడాది మే 24న కేరళకు... 26న జిల్లాలోకి ప్రవేశించాయి. నైరుతి రుతుపవనాల ప్రవేశం తర్వాత కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లుల నుంచి ఓ మోస్తరు వర్షం పడింది. మరోసారి పదును వర్షం పడితే విత్తనం వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

సబ్సిడీ విత్తనం కోసం..

ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి 54,184 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలను కేటాయించారు. ఇందులో వేరుశనగ 50,592, వరి 800, మినుములు 36, పెసలు 60, కంది 2380, అలసంద 60, రాగి 4, కొర్ర 45, జీలుగ 190, జనుము 2, పిల్లిపెసర 15 క్వింటాళ్లను కేటాయించారు. బహిరంగ మార్కెట్‌లో కే-6 విత్తనాలు క్వింటాల్ రూ.11,500, ఎత్తు ట్యాగ్ రకం రూ.12వేలకు విక్రయిస్తున్నారు. ఒంగోలు, నెల్లూరు జిల్లాల నుంచి ఎత్తు ట్యాగ్ రకం విత్తన వేరుశనగ కాయలను వ్యాపారులు గుత్తి, ఇతర ప్రాంతాలకు తీసుకొచ్చి, అక్కడే మిషన్‌లో ఆడించి రైతులకు విక్రయిస్తున్నారు. ఎక్కువ విస్తీర్ణం భూమి కలిగిన రైతులు బహిరంగ మార్కెట్‌లోనే విత్తన వేరుశనగ కొనుగోలు చేస్తున్నారు. తక్కువ విస్తీర్ణం ఉన్నవారు సబ్సిడీ విత్తనం కోసం ఎదురుచూస్తున్నారు. రెండ్రోజులుగా రైతు సేవాకేంద్రాల్లో సబ్సిడీ విత్తన వేరుశనగ కావాల్సిన రైతులతో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. ఇప్పటిదాకా 920 మంది రైతులు 811 క్వింటాళ్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. జిల్లాలోని 21 మండలాల పరిధిలో 167 ఆర్ఎస్‌కేలకు 17,180 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలు సరఫరా చేశారు. ఈ పరిస్థితుల్లో ఎప్పటినుంచి విత్తన పంపిణీ ప్రారంభిస్తారో ఇంకా స్పష్టమైన సమాచారాన్ని వ్యవసాయ అధికారులు ఇవ్వలేకపోతున్నారు. విత్తనకాయల ప్రాసెసింగ్‌ను మరింత వేగవంతం చేసి, సరఫరా చేస్తేనే సకాలంలో విత్తన పంపిణీ మొదలుపెట్టే అవకాశం ఉంటుంది. లేదంటే మరింత ఆలస్యమయ్యే ప్రమాదం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

పదును వర్షం పడితే విత్తేస్తాం



ఇటీవల కురిసిన వర్షాలకు ఐదెకరాల్లో సేద్యం పనులు చేశా. ఈసారి సబ్సిడీ విత్తనం పంపిణీ ఆలస్యమయ్యే అవకాశం ఉండటంతో బహిరంగ మార్కెట్‌లోనే కొనుగోలు చేశా. విత్తనాన్ని సిద్ధం చేసుకున్నాం. పదును వర్షం పడితే జూన్ 8న ప్రారంభమయ్యే మృగశిర కార్తెలో విత్తేస్తా. సకాలంలో వర్షాలు పడితే ఈసారైనా పంట పడుతుందని ఆశలు పెట్టుకున్నాం.

- రైతు శ్రీనివాస్ చౌదరి, ధర్మాపురం, గుత్తి రూరల్ మండలం

ఎదురుచూస్తున్నా..



ఇటీవల పడిన వర్షాలకు ఏడెకరాల్లో సేద్యం పనులు చేసుకున్నా. సబ్సిడీ విత్తనం కోసం ఎదురుచూస్తున్నా. గతేడాది ఈపాటికే సబ్సిడీ విత్తనకాయలు పంపిణీ చేశారు. ఈసారి ఇంకా రిజిస్ట్రేషన్ మొదలు పెట్టారు. ఎప్పటి నుంచి పంపిణీ చేస్తారో కచ్చితంగా ఎవరూ చెప్పలేకపోతున్నారు. పదును వర్షం వస్తే మిగతా రైతులతోపాటే మృగశిర కార్తెలోనే విత్తనం వేయాలనుకుంటున్నా. దీనిని దృష్టిలో ఉంచుకుని, త్వరగా సబ్సిడీ విత్తన కాయలు పంపిణీ చేస్తే బాగుంటుంది.

- రైతు భాస్కర్, ఊబిచెర్ల, గుత్తి రూరల్ మండలం


శరవేగంగా..

హెచ్చెల్సీ లైనింగ్, బ్రిడ్జి పనులు



115వ కిలోమీటరు వద్ద చేపట్టిన లైనింగ్ పనులు

బొమ్మనహాళ్, మే 31(ఆంధ్రజ్యోతి): జిల్లాకి జీవనాడి అయిన తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) మరమ్మతు పనులు శరవేగంగా సాగుతున్నాయి. తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో వస్తుండడంతో పనుల్లో వేగం పెంచారు. కాలువను గత పాలకులు నిర్వీర్యం చేశారు. కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. కాలువ గట్టు బలహీనపడడంతో నీరు కూడా తక్కువగానే తీసుకున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక సాగు, తాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టింది. దీంతో హెచ్చెల్సీకి పూర్వ వైభవం తీసుకువస్తున్నారు. టెండర్ల ద్వారా నిధులు కేటాయించి సాగునీటి కాలువ పనులకు శ్రీకారం చుట్టారు. రూ.28.05 కోట్లతో 11 పనులు చేపడుతున్నారు. నీటి ప్రవాహానికి ఇబ్బందిగా ఉన్న ప్రాంతాల్లో మరమ్మతులు చేసేందుకు టెండర్లు పిలిచి, పనులు చేస్తున్నారు. నాగలాపురం, మల్లికేతి, ఉద్దేహాళ్, దర్గాహొన్నూరు గ్రామాల వద్ద బ్రిడ్జిలు, 115 నుంచి 130వ కిలోమీటరు పరిధిలో లైనింగ్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఎగువ కాలువకు తుంగభద్ర జలశయం నుంచి నీరు విడుదలైన తర్వాత రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయకట్టుకు సాగునీరు ఇచ్చేలా పనులు కొనసాగుతున్నాయి.



నాగలాపురం వద్ద బ్రిడ్జి పనులు

పొగాకు ఆరోగ్యానికి హానికరం

డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవి

అనంతపురం టౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరమని జిల్లా వైద్యాధికారి డాక్టరు ఈబీదేవి సూచించారు. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లావైద్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభించారు. ఇది తెలుగుతల్లి విగ్రహం వరకు కొనసాగింది. ప్రజలకు పొగాకు వల్ల కలిగే అనర్థాలు గురించి అవగాహన కల్పిస్తూ వివిధ రకాల ప్లేకార్డులు ర్యాలీలో ప్రదర్శించారు. ఈసందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ పొగాకు ఏరూపంలో వాడినా మనిషి ఆరోగ్యానికి హాని కలిగిస్తుందన్నారు. పొగాకు వాడకంపై ప్రభుత్వం నిషేధిత చట్టాలను తీసుకొచ్చిందన్నారు. విద్యాసంస్థల సమీపంలో పొగాకు సంబంధిత బీడీ, సిగరెట్లు అమ్మకాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ గిరిజామనోహర్, మలేరియా అధికారి డాక్టరు ఓబులు, డెమోలు త్యాగరాజు, గంగాధర్, ఎన్‌హెచ్ఎం కిషోర్, ఫణి, సోషల్‌వర్కర్ శ్రీరాములు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ కొనసాగిస్తున్న డీఎంహెచ్ఓ, ఇతరవైద్యులు,సిబ్బంది



ర్యాలీ చేపడుతున్న ప్రిన్సిపాల్,సూపరింటెండెంట్, డాక్టర్లు, మెడికోలు

పొగాకుతో జాగ్రత్త: ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

కేన్సర్ కారకం పొగాకు పట్ల జాగ్రత్త వహించాలని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. కళాశాలలో డాక్టర్లు, మెడికోలతో కలిసి శనివారం పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పొగాకు వాడకం ఆరోగ్యాన్ని పాడు చేస్తుందన్నారు. అందుకే ఎవరూ పొగాకు ఉత్పత్తుల జోలికి వెళ్లకండని సూచించారు. పొగాకుకు వ్యతిరేకంగా ఉంటామని మెడికోలతో ప్రతిజ్ఞ చేయించారు.

అండర్-23 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక



ఎంపికైన జిల్లా అండర్-23 క్రికెట్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, మే 31(ఆంధ్రజ్యోతి): జిల్లా అండర్-23 పురుషుల క్రికెట్ వన్డే జట్టును ఎంపిక చేశారు. వివరాలను శనివారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, భీమలింగా రెడ్డి ప్రకటించారు. పి. అర్జున్ టెండూల్కర్ (కెప్టెన్), ఎంకె దత్తారెడ్డి (వికెట్ కీపర్), కేహెచ్ వీరారెడ్డి, మహేంద్రరెడ్డి, జయంత్ కృష్ణ, భానుప్రకాష్, వికాస్, మనోజ్‌కుమార్, ఎంకె లోహిత్‌సాయి కిషోర్, మల్లికార్జున, కమిల్, దీపక్, నిశ్చయ్, ప్రదీప్‌రెడ్డి, లీలసాయి, ప్రశాంత్ ఎంపికయ్యారు. స్టాండ్‌బైలుగా ఎం జైకృష్ణ, కె వెంకట్‌లోకేష్, పి. మణిదీప్, కె ప్రమోద్, వి. ప్రవీణ్, సిహెచ్ భార్గవ్‌రాజు స్థానం సంపాదించారు. కోచ్‌గా శర్మాస్‌వలి నియమితులయ్యారు. ఆదివారం నుంచి కడపలో జరిగే ఏసీఏ అండర్-23 వన్డే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుంది.

జనహోబిలం



ప్రత్యేక అలంకరణలో స్వామివారి మూల విరాట్

ఉరవకొండ, మే31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం పల్లకీ సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

క్రైం కార్నర్

కర్ణాటక బస్సు, కారు ఢీ

- వృద్ధుడి మృతి, నలుగురికి గాయాలు



బస్సు కింద ఇరుక్కుపోయిన కారు

ఉరవకొండ, మే31(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదగవి గ్రామ సమీపాన శనివారం కేఎస్ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్న ప్రమాదంలో జాన్‌రెడ్డి (80) అనే వృద్ధుడు మృతి చెందగా.. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ధర్మవరానికి చెందిన జాన్ రెడ్డి కుటుంబసభ్యులు హంపికి వెళ్లి, కారులో తిరుగు ప్రయాణమయ్యారు. బూదగవి సమీపాన అనంతపురం నుంచి గంగావతికి వెళ్తున్న కేఎస్ఆర్టీసీ బస్సు కారును ఢీకొంది. బస్సు కింద కారు ఇరుక్కుపోయింది. కారులో ప్రయాణిస్తున్న జాన్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి భార్య చిన్నమ్మ, కుమార్తె సైనీదీప్తి, మనవడు రోహన్‌తోపాటు డ్రైవర్ వెంకటరమణ తీవ్రంగా గాయపడ్డారు. వారిని హుటాహుటిన ఉరవకొండ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం వెళ్లాలని వైద్యులు సూచించారు. ప్రమాద స్థలాన్ని సీఐ మహానంది పరిశీలించారు. జాన్‌రెడ్డి మృతదేహాన్ని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మళ్లీ అదే సీన్

- ఫయాజ్ ఇంటి కొలతలకు వెళ్లిన అధికారులు
- కొందరిని లోపలికి పంపడానికి అభ్యంతరం



ఇంటిని కొలుస్తున్న అధికారులు

తాడిపత్రి, మే 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిన్నబజారులో ఉన్న వైసీపీ కౌన్సిలర్ ఫయాజ్‌బాషా కొత్త ఇంటికి సంబంధించి కొలతల విషయంలో అధికారులతో శనివారం వాగ్వాదం జరిగింది. ఫయాజ్‌బాషా మున్సిపల్ స్థలాన్ని కొంత ఆక్రమించి కొత్తగా ఇంటిని నిర్మించాడని మున్సిపల్ అధికారులు గతంలో ఆయన ఇంటివద్దకు వెళ్లారు. విషయం కోర్టులో నడుస్తోందని ఫయాజ్‌బాషా మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇదేక్రమంలోనే మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు ఎన్‌క్రోచ్‌మెంట్‌లో ఉన్న ఫయాజ్ ఇంటి నిర్మాణాలను తొలగించాలని ఎక్స్‌కవేటర్ తీసుకువెళ్లిన విషయం తెలిసిందే. ఈ విషయంగా వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య రాళ్ల దాడులు జరిగాయి. దీంతో జిల్లా అధికారులు కొలతల విషయంగా ఒక కమిటీని నియమించారు. ఆ కమిటీ 20రోజుల కిందట ఫయాజ్‌బాషా ఇంటివద్దకు వెళ్లగా ఎవరూ లేకపోవడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. మళ్లీ శనివారం ఇంటి కొలతలకు కమిటీ సభ్యులు వెళ్లగా, కొంతమంది లోపలకు రాకూడదని ఫయాజ్ అభ్యంతరం తెలిపాడు. దీంతో కొంత వాగ్వాదం జరిగింది. తహసీల్దార్ రజాక్‌వలి జోక్యం చేసుకొని కమిటీలో సభ్యులు మాత్రమే లోపలికి వెళతామని చెప్పారు. అధికారులు మాత్రమే వెళ్లాలని కౌన్సిలర్లకు ఏమి సంబంధమని వారిని వెళ్లనిచ్చేది లేదని ఫయాజ్‌బాషా వాగ్వాదానికి దిగారు. దీంతో అధికారులను మాత్రమే లోపలికి పంపించి కొలతలు జరిగేటట్లు చూశారు.

చీనీ టన్ను రూ. 30వేలు

అనంతపురం రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 30వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 3వేలు, సరాసరి రూ. 18వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 508 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ప్రగతి రైలు కోచ్ రెస్టారెంట్ పరిశీలన



డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాకు స్వాగతం పలుకుతున్న అధికారులు..

అనంతపురం న్యూటౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రగతి రైలు కోచ్ రెస్టారెంట్‌ను డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా శనివారం పరిశీలించారు. రెస్టారెంట్ డైరెక్టర్ ఆనంద్ ఆయనకు స్వాగతం పలికారు. గుంతకల్లు డివిజన్ పరిధిలో రెండో రైల్వే కోచ్ రెస్టారెంట్‌ను అనంతపురంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని డీఆర్ఎం అన్నారు. రైల్వే ప్రయాణికులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడంలో భాగంగా, పాత రైల్‌కోచ్‌లతో ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు ఉండేలా రెస్టారెంట్ అందుబాటులోకి తెచ్చామని అన్నారు.

ఉద్యమ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

- పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాస యాదవ్

అనంతపురం అర్బన్, మే 31(ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు తప్పనిసరిగా ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాస యాదవ్ సూచించారు. స్థానిక పరిశ్రమల శాఖ జీఎం కార్యాలయంలో శనివారం వ్యాపారులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ... ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ఉంటేనే బ్యాంకర్లు రుణాలు మంజూరు చేస్తారన్నారు. బిజినెస్ చేయాలనుకునే వారు ముందస్తుగానే ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దీనిపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీ రాజశేఖర్‌రెడ్డి, ఐపీఓ రవీంద్రనాథ్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ చలపతి, సిబ్బంది పాల్గొన్నారు.

గోదాముల్లోనే... పప్పుశనగ..!

- గిట్టుబాటు ధరలేక పెరిగిన నిల్వలు
- తక్కువ ధరకే కొందరు రైతులు విక్రయం
- ధర పెరుగుతుందన్న ఆశలో చాలామంది..



గోదాములో నిల్వ ఉంచిన పప్పుశనగ పంట

అనంతపురం అర్బన్/బెళుగుప్ప, మే 31(ఆంధ్రజ్యోతి): ఆశించిన ధరలు రాకపోవడంతో రైతులు నిల్వచేసిన పప్పుశనగ గోదాముల్లోనే మూలుగుతోంది. గిట్టుబాటు ధర లేకపోవడంతో రెండేళ్లుగా పప్పుశనగను గోదాముల్లో నిల్వ చేసుకున్నారు. గత ఏడాది రబీ పంటను ఎక్కువ మంది మంది రైతులు నిల్వ చేసుకున్నారు. డబ్బులు అత్యవసరమైన రైతులు బయట వ్యాపారులకు అమ్మేశారు. మరికొందరు ధరలు పెరుగుతాయన్న ఆశతో ఎదురు చూస్తున్నారు. ఈ రబీసీజన్‌లో కొత్త పంట కూడా జత కావడంతో గోదాముల్లో నిల్వలు పెరిగిపోయాయి. గత ఏడాది రబీలో సాగు చేసిన పప్పుశనగ పంట కోతలు ఈ ఏడాది ఫిబ్రవరిలో పూర్తయ్యాయి. అప్పట్లో పప్పుశనగ నాణ్యత ఆధారంగా క్వింటా ధర రూ.5వేల నుంచి రూ.5,500 దాకా పలికింది. పంట కోతలు పూర్తయి మూడు మాసాలు గడుస్తున్నా ధరలో పెద్దగా మార్పు కనిపించలేదు. రబీ సీజన్ ఆరంభంలో విత్తనం వేసేందుకు క్వింటా పప్పుశనగ రూ.7వేల నుంచి రూ.8వేలతో కొనుగోలు చేశారు. గత ఏడాది ఎకరాకు 4 క్వింటాళ్లలోపు దిగుబడి వచ్చింది. పంట సాగు కోసం రూ.20 వేల దాకా పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం క్వింటా రూ.5,800 పలుకుతోంది. కష్టపడి పంట పండించిన తర్వాత కొనుగోలు చేసిన ధర కూడా లభించకపోవడంతో ఏం చేయాలో తోచని అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. 2023-24 సంవత్సరంలో పంట కోత సమయంలో క్వింటా రూ.5500 పలికింది. తర్వాత కొన్ని నెలలకు క్వింటా పప్పుశనగ రూ.6వేల నుంచి రూ.6500 పెరిగింది. కొన్నేళ్ల క్రితం క్వింటా రూ.10వేలకు పైగానే పలికింది. తర్వాత ప్రతి ఏడాది ధర తగ్గుతూ వస్తోంది. దళారులు కుమ్మక్కై ధరలు తగ్గిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండేళ్లుగా గోదాముల్లోనే...

ఆశించిన స్థాయిలో పప్పుశనగ ధరలు లేకపోవడంతో గత రెండేళ్లుగా ఎక్కువ శాతం పప్పుశనగ పంట ఉత్పత్తులు గోదాముల్లో నిల్వ చేసుకున్నారు. బెళుగుప్ప మండలంలో ఐదు గోదాములు ఉన్నాయి. రెండేళ్ల నుంచి పప్పుశనగ పంట ఉత్పత్తులు నిల్వ చేసుకున్నారు. ప్రస్తుతం ఒక్కో గోదాములో 5వేల మెట్రిక్ టన్నుల పప్పుశనగ నిల్వ ఉన్నట్లు గోదాముల నిర్వాహకులు చెబుతున్నారు. విడపనకల్లులోని గోదాములో 800 క్వింటాళ్ల పప్పుశనగ నిల్వ ఉంది. మిగతా ప్రాంతాల్లోని గోదాముల్లో ఇదే స్థాయిలో నిల్వలు ఉన్నట్లు సమాచారం.

భారమవుతున్న బాడుగలు

గోదాముల్లో నిల్వచేసుకున్న పప్పుశనగకు బాడుగలు చెల్లించడం రైతులకు భారమవుతున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రైవేటు శీతల గిడ్డంగులు ఉన్నాయి. ఉరవకొండ, బెళుగుప్ప, విడపనకల్లు, పుట్లూరు, తాడిపత్రి, కణేకల్లు తదితర మండలాల్లో ప్రైవేటు వ్యక్తులు శీతల గిడ్డంలు ఏర్పాటు చేశారు. బెళుగుప్ప మండలంలోని గోదాముల్లో ఆరు నెలలకు క్వింటాకు రూ.రూ.60 నుంచి 70 వరకు బాడుగ వసూలు చేస్తున్నారు. ఏడో నెల నుంచి క్వింటాపై నెలకు రూ.10 అదనంగా బాడులు చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారు. విడపనకల్లులో క్వింటాలు పప్పుశనగకు ఏడాదికి రూ.150, ఉరవకొండలో ఏడాదిలోపు వరకు క్వింటాలుకు రూ.100 వసూలు చేస్తున్నారు. పుట్లూరు మండంలో క్వింటాలుకు నెలకు రూ.10 వసూలు చేస్తున్నారు.

గిట్టుబాటు ధర వస్తేనే గట్టెక్కేది



పంట పండుతుందన్న ఆశతో ప్రతి ఏడాది పప్పుశనగ పంట సాగుచేస్తున్నా. గతేడాది 50 ఎకరాల్లో పప్పుశనగ పంట సాగు చేశాను. ఎకరాకు 4 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ఈసారి దిగుబడి తగ్గినా ధరలు అంతంతగానే ఉన్నాయి. దిగుబడి తగ్గినప్పుడు సాధారణంగా ధరలు పెరగాలి. మరెందుకో పంట కోత సమయం నుంచి ఇప్పటి దాకా ధరలో పెద్దగా మార్పు కనిపించడం లేదు. ధర పెరగకపోతుందా..? అన్న ఆశతో పంటనంతా గోదాముల్లో నిల్వ చేశా. గిట్టుబాటు ధర వస్తేనే గట్టెక్కేది. లేకుంటే నష్టపోవాల్సిందే.

- బి.ఆదినారాయణ, తగ్గుపర్తి, బెళుగుప్ప మండలం

పంటంతా గోదాములోనే నిల్వ చేశా



గతేడాది రబీలో 25 ఎకరాల్లో పప్పుశనగ పంట సాగు చేశా. ఎకరాకు 4 నుంచి నాలుగున్నర క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లో కొంత ఎక్కువగా ఉంది. పెట్టుబడులు ఎక్కువైనందున ఆ ధరకు పంటను అమ్మితే నష్టమే. అందుకే ఈసారి రైతులెవరూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంటను విక్రయించలేదు. గతేడాది పప్పుశనగ పంటంతా గోదాములోనే నిల్వ చేశా. ఐదేళ్లుగా ఆశించిన మేరకు ధరలు లేకపోవడంతో నష్టపోతూనే ఉన్నాం. ఈసారి ఏమైతుందోనని ఆందోళనగా ఉంది.

-రుద్రయ్య, ఎర్రగుడి, బెళుగుప్ప మండలం

తప్పనిసరిగా కదల్లేదు..!

- ఐదేళ్లు దాటినా అక్కడే తిష్ట
- జడ్పీ బదిలీల్లో మాయాజాలం
- చక్రంతిప్పిన యూనియన్ నాయకులు, అధికారులు



కౌన్సెలింగ్ చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్, సీఈఓ

అనంతపురం విద్య, మే 31(ఆంధ్రజ్యోతి): జడ్పీలో బదిలీల్లో అయినవారికి అనుకున్న చోటే పీటమేశారు. కాని వారిని సాగనంపారు. తొమ్మిదేళ్లు.. పదేళ్లు ఒకేస్థానంలో పనిచేసిన ఉద్యోగులు కదలాల్సి ఉన్నా.. పాత స్థానాలనే దక్కించుకున్నారు. కొందరు గొంతెత్తి అడిగినా పాత స్థానాలను ఇవ్వలేదు. కొందరు సంఘాల నాయకులు, అధికారులు తెర వెనుక తతంగం నడిపారు. దీనికి పాలకులు, అధికారులు లైట్ లైట్ అంటూ తలులు ఊపారు. జడ్పీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా జడ్పీ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ శనివారం నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ జరిగింది.

తప్పనిసరి అయినా..

రెండు జిల్లాల్లో ఐదేళ్ల ఒకేచోట పనిచేసిన కొందరు ఉద్యోగులను పాలకులు, అధికారులు కదిలించలేదు. నిబంధనల మేరకు వారు ఖచ్చితంగా బదిలీ కావాల్సి ఉన్నా పట్టించుకోలేదు. అదే స్థానంలో ఉంటామని కొందరు అడిగిందే తడవు అనుగ్రహించారు. మరికొందరు ఐదేళ్ల సర్వీసు పూర్తి అయిందని, మరో ప్రాంతానికి వెళతామని అడిగినా.. వారు కోరిన స్థానాలుగాని, ఆప్షన్ పెట్టినవిగాని ఇవ్వలేదు. కౌన్సెలింగ్‌లో కొందరు సంఘాల నాయకులు, జడ్పీలో చక్రం తిప్పే కొందరు అధికారుల హవా నడిచింది. వారు చెప్పినట్లు కౌన్సెలింగ్ నిర్వహించారని ప్రచారం జరుగుతోంది. తమకు తీరని అన్యాయం చేశారని బాధిత ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బదిలీ అయిన జడ్పీ ఉద్యోగుల వివరాలు

కేడర్	తప్పసరి దరఖాస్తులు	తప్పసరి బదిలీ	రిక్వెస్టు దరఖాస్తులు	రిక్వెస్టు బదిలీ
ఎంపీడీఓలు	0	0	8	4
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు	0	0	13	6
సీనియర్ అసిస్టెంట్లు	10	4	16	3
జూనియర్ అసిస్టెంట్లు	6	2	32	15
టైపిస్టులు	3	0	9	3
రికార్డు అసిస్టెంట్లు	46	12	16	3
ల్యాబ్ అసిస్టెంట్లు	12	9	5	3
లైబ్రరీ అసిస్టెంట్లు	1	1	0	0
ఆఫీస్‌సబార్డినేట్స్	74	14	14	11
మొత్తం	152	42	113	48

అధికారుల లెక్కలు ఇవీ...

ఉమ్మడి జిల్లాలో నలుగురు ఎంపీడీఓలు బదిలీ అయ్యారని అధికారులు ప్రకటించారు. విజయ భాస్కర్ ముదిగుప్ప మండలం నుంచి బొమ్మనహాళ్ మండలానికి, ఆజాద్ రామగిరి మండలం నుంచి తనకల్లుకు, గంగావతి నార్పల మండలం నుంచి రామగిరికి, మమతాదేవి తనకల్లు నుంచి నార్పలకు బదిలీ అయినట్లు ప్రకటించారు. తప్పనిసరి బదిలీ కింద 152 మంది ఉద్యోగులు దరఖాస్తు చేయగా 42 మందిని, రిక్వెస్టు కింద 113 మంది దరఖాస్తు చేయగా 48 మందిని బదిలీ చేసినట్లు జడ్పీ అధికారులు ప్రకటించారు. వీరిలో ఎంపీడీఓలు, ఏవోలు, సీనియర్ అసిస్టెంట్లు, ఇతర ఉద్యోగులు ఉన్నారు.



జడ్పీ మెయిన్ హాల్ వద్ద ఉద్యోగుల హడావుడి



మాట్లాడుతున్న విద్యానృసింహ భారతి స్వామి

ధర్మ పరిరక్షణ కోసం ఏకతాటిపైకి రావాలి

- విద్యా నృసింహ భారతి స్వామి
- ముగిసిన బజరంగ్‌దళ్ శిక్షణా తరగతులు

అనంతపురం కల్చరల్, మే 31(ఆంధ్రజ్యోతి): దేశంలో ధర్మ పరిరక్షణ కోసం అన్నివర్గాలవారూ ఏకతాటిపైకి రావాలని విద్యానృసింహ భారతిస్వామి అన్నారు. నగర శివారు వడియంపేట వద్ద గల కేశవరెడ్డి పాఠశాలలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తాళంకి వెంకటరత్నమయ్య ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బజరంగ్‌దళ్ శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి విద్యా నృసింహభారతి స్వామి హాజరై ప్రసంగించారు. యువత దేశ రక్షణ, ధర్మ పరిరక్షణే ధ్యేయంగా భావజాలాన్ని పెంపొందించుకోవాలన్నారు. సమాజంలో హిందూధర్మ వ్యతిరేకవాదులు చేస్తున్న అరాచకాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాల న్నారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ ఉభయ తెలుగు రాష్ట్రాల కార్యదర్శి తనికెళ్ల సత్యరవికుమార్, బజరంగ్‌దళ్ ఉభయ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ వీరకుమార్‌స్వామి, పోలేపల్లి సందీప్, కసాపురం రవి, జిల్లా కార్యదర్శి విశ్వనాథరెడ్డి, సహాయ కార్యదర్శి బొబ్బ కిషోర్‌నాయుడు, జిల్లా కన్వీనర్ సురేంద్రబాబు, ఉపాధ్యక్షుడు కోనేటి రమణబాబు, జిల్లా గోరక్ష ప్రముఖ్ గుర్రం సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పదవీ విరమణ పొందిన ఉద్యోగులను అనంతపురం కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివనారాయణ శర్మ తదితర అధికారులు సత్కరించారు. మొత్తం 33 మంది ఉద్యోగులు, అధికారులు, అధ్యాపకులు పదవీ విరమణ పొందిన సందర్భంగా కలెక్టరేట్‌కు వచ్చి.. అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్అండ్‌బీలో క్లరికల్ సిబ్బందికి బదిలీలు



సిబ్బందికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఈ రాజగోపాల్

అనంతపురం న్యూటౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆర్అండ్‌బీలో ఉన్న క్లరికల్ సిబ్బందికి ఎస్ఈ రాజగోపాల్ ఆధ్వర్యంలో సర్కిల్ కార్యాలయంలో శనివారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఐదేళ్లు ఒకే చోట ఉద్యోగ కాలాన్ని పూర్తి చేసుకున్న వారితో పాటు జీఓలో పేర్కొన్న విధంగా అర్హతలు ఉన్న వారు కూడా కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. జూనియర్ అసిస్టెంట్లు-8, టైపిస్టు-2, రికార్డు అసిస్టెంట్లు-3, అటెండర్లు-33, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు 4, డ్రైవర్లు ఇద్దరు ఆప్షన్లు ఇవ్వడంతో కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. అందుకు అనుగుణంగా జాబితా తయారు చేసి తుది జాబితాను వెల్లడించనున్నట్లు ఎస్ఈ తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ డిప్యూటీ ఎస్ఈ రమాదేవి, ఎన్‌హెచ్ ఈఈ సుధాకర్ రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈలు ప్రసాద్‌రెడ్డి, సంజీవయ్య పాల్గొన్నారు.

డీపీఓలో కార్యదర్శులకు...

జిల్లా పంచాయతీ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 వరకు ఒకేచోట ఐదేళ్ల ఉద్యోగ కాలాన్ని పూర్తి చేసిన వారికి డీపీఓ నాగరాజనాయుడు ఆధ్వర్యంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రేడ్-1, ఆరుగురు, గ్రేడ్-3, 11 మంది, గ్రేడ్-4 32 మందితోపాటు మరో ముగ్గురు డిప్యూటీ ఎంపీడీఓలు మొత్తం 52 మందికి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు డీపీఓ పేర్కొన్నారు. బదిలీల జాబితా తయారు చేసి కలెక్టర్ ఆమోదానికి పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ విజయ్‌కుమార్, ఏఓ నాగరాజు, సీనియర్ అసిస్టెంట్లు లీలాబాయి, ఉష తదితరులు పాల్గొన్నారు.



కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీపీఓ నాగరాజనాయుడు

తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు గుంతకల్లు వరకు పొడిగింపు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎర్రగుంట్ల/కొండాపురం, మే 31(ఆంధ్రజ్యోతి): కడప-విశాఖపట్నం మధ్య నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు (ట్రైన్ నెంబర్18521/18522) ను జూన్ 2 నుంచి గుంతకల్లు వరకు పొడిగించినట్లు ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కడప నుంచి గుంతకల్లు వరకు ఈ ట్రైన్‌ను స్పెషల్ ట్రైన్ (నెంబర్ 07521 /07522) గా ట్రీట్ చేస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీచేసింది. విశాఖపట్నం నుంచి కడపకు ఉదయం 7..45 గంటలకు చేరుకుని ఎర్రగుంట్ల, కొండాపురం, తాడిపత్రి, గుత్తి మీదుగా గుంతకల్లుకు ఉదయం 11.15కు చేరుతుంది. తిరిగి గుంతకల్లులో మధ్యాహ్నం 1.30కి బయలుదేరి కడపకు సాయంత్రం 5.15 కు చేరుకుంటుంది. అక్కడి నుంచి విశాఖపట్నం వెళుతుంది. గతంలో కడప-కొండాపురం మధ్య ఖాళీగా వెళ్లే ఈ రైలుకు ఎర్రగుంట్ల, కొండాపురం రైల్వేస్టేషన్‌లలో స్టాపింగ్ ఇవ్వాలని 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాలు ప్రచురించింది. అంతేకాకుండా స్టాపింగ్ కోసం ప్రజాప్రతినిధులు, పలు ప్రజాసంఘాలు రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఒత్తిడి తెచ్చారు. దీంతో ఈ రైలును కడప నుంచి గుంతకల్లు వరకు పొడిగించడంతో పాటు ఎర్రగుంట్ల, కొండాపురం, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు రైల్వేస్టేషన్‌లలో స్టాపింగ్ ఇస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

సమస్యలు మాదృష్టికి తీసుకురండి: ట్రైనీ డీఎస్పీ



గ్రామస్థులతో మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ ఉదయపావని

అమడగూరు (కదిరి), మే 31(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ట్రైనీ డీఎస్పీ ఉదయపావని తెలిపారు. శనివారం మండలంలోని మహమ్మదాబాద్ ఎస్సీకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే, సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రామక్రిష్ణారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ రామక్రిష్ణ గౌడ్, కార్యదర్శి జానకీ, అగ్రికల్చర్ అసిస్టెంట్ రమణ పాల్గొన్నారు.

హెల్మెట్‌తోనే రక్షణ

వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని ట్రైనీ డీఎస్పీ ఉదయపావని సూచించారు. మహమ్మదాబాద్, కొక్కంటి క్రాస్ రహదారి, మూడురోడ్ల కూడలిలో వాహనాలు తనిఖీలు చేశారు. వాహనాలు నడిపేవారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. 18 సంవత్సరాలలోపు పిల్లలు ద్విచక్రవాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కార్మిక నాయకుడిపై కేసు

కదిరి, మే 31(ఆంధ్రజ్యోతి): కార్మిక నాయకుడు, తెలుగుదేశం పార్టీ మాజీ పట్టణాధ్యక్షుడు అహమ్మద్‌అలీపై శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. పట్టణానికి సమీపంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద గతంలో భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన పట్టాల విషయంలో షేక్ బాబా ఫకృద్దీన్ ఫిర్యాదు చేశారు. తనవద్ద 2006లో పట్టాలిప్పిస్తామని రూ.1250 ఇప్పించుకున్నారని, తనతోపాటు 500 మంది వద్ద కట్టించుకుని పట్టాలివ్వకుండా మోసం చేశాడన్నారు. ఇదేమని అడిగినందుకు తనను బెదిరించారని, అహమ్మద్‌అలీతోపాటు రెడ్డిపల్లి రఫీక్, రవి, రమణ నాగేష్, ఇంటి పట్టాలిచ్చే ప్రసక్తే లేదని, మీకు దిక్కున్నచోట చెప్పుకోమని బెదిరించినట్లు చెప్పారు. మరోసారి స్థలాల వద్దకు వస్తే బతికి బట్టకట్టవని బెదిరించినట్లు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

వ్యక్తిపై దాడి.. ఐదుగురిపై కేసు

పాతకక్షలతో వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఐదుగురిపై హత్యా యత్నం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. రైల్వేస్టేషన్ రోడ్డులో శుక్రవారం రాత్రి దాదాపీర్ అనే వ్యక్తిపై పట్టణానికి చెందిన ముజ్జు, మైనూ, ఇనామ్, అ స్వీర్, రఫీక్ అడ్డగించి, చాకులతో దాడిచేశారు. బాధితుడి తండ్రి ఇమామ్‌సాబ్ ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



ఓబుళదేవరచెరువు, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పగడాలవారిపల్లికి చెందిన కొక్కంటి శంకరప్ప (54) అనే వ్యక్తి శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తరచూ మద్యం సేవించడంతో కుటుంబ సభ్యులు మందలించారు. గ్రామ సమీపంలోని ముళ్ల చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కులం పేరుతో దూషిస్తే కఠిన చర్యలు

బత్తలపల్లి, మే 31(ఆంధ్రజ్యోతి): దళితులను హేళనగా మాట్లాడినా, కులం పేరుతో దూషించినా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ స్వర్ణలత, ఎస్ఐ సోమశేఖర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని సంజీవపురం ఎస్సీ కాలనీలో శనివారం పౌర హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హత కలిగిన వారికి ప్రభుత్వ పథకాలు అందక పోతే కార్యాలయానికి వచ్చి సంప్రదించాలన్నారు. వ్యక్తిగత జీవితానికి ఎవరైనా భంగం కలిగిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది మానవహారం

తనకల్లు, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కంటిక్రాస్‌లో శనివారం కొక్కంటి వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ, మానహారం నిర్వహించారు. సింగరేటు, బీడీలు, గుట్కా పొగాతో తయారైయ్యే వాటిని తీసుకోవడం వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు. ప్రపంచ పొగాకు నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. పొగాకు దూరంగా ఉండాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో డీపీఎంఓ అనురాధ, డాక్టర్లు లోకేశ్వర్‌రెడ్డి, ధర్మరాజు, ఎంపీహెచ్ఈఓ ఓబులేసు, సూర్యనారాయణరెడ్డి, సావిత్రమ్మ, ఎంఎల్‌హెచ్‌పీఓలు, ఎఎన్ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్‌పై రైతులకు అవగాహన

కదిరిఅర్బన్, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలచెరువు, కుటాగుళ్ల గ్రామాల్లో శనివారం ఖరీఫ్ సీజన్‌పై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో రెడ్డిపల్లి వ్యవసాయ క్షేత్రం శాస్త్రవేత్త మాధవి, సీనియర్ శాస్త్రవేత్తలు మంజునాథ్, తదితరులు మాట్లాడుతూ.. వివిధ ప్రాంతాలకు ప్రత్యేకమైన ఖరీఫ్ పంటలకు ఆధునిక సాంకతికత గురించి రైతులకు వివరించాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు, వనరులను ఎలా పెంచాలి, ఖర్చులు ఎలా తగ్గించాలన్నదానిపై వివరించారు. రైతులు శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించి అధిక లాభాలు పొందాలన్నారు. ఒకే పంట కంటే పలురకాల పంటలు సాగుచేస్తే నేల సారాన్ని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడీ సనావుల్లా, ఉద్యాన శాఖాధికారి ప్రసాద్‌రెడ్డి, ఏఓ శ్రీహరినాయక్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం: పల్లె

నల్లమాడ, మే 31(ఆంధ్రజ్యోతి): ఏ కష్టమొచ్చినా కార్యకర్తలకు అండగా ఉండి ఆదుకుంటామని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గోపేపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఈటీ రామక్రిష్ణ(65) అనారోగ్యంతో మృతి చెందారు. పలు ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించినట్లు బంధువులు తెలిపారు. పల్లె రఘునాథ్‌రెడ్డి గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థికసాయం చేశారు. మీ కుటుంబానికి పార్టీతోపాటు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు ఈఓఆర్డీ విశ్వనాథ్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ షైలే శివశంకర్, నాయకులు బూట్టి నాగ భూషణనాయుడు, మంజునాథ్‌రెడ్డి, సర్పంచ్ భారతి, సలాంఖాన్ ఉన్నారు.



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి పల్లె

పడిగాపులకు ఇక ఫుల్‌స్టాప్

- చౌకదుకాణాల వద్దే సరుకుల పంపిణీ
- నేటి నుంచి నూతన విధానం

ఓబుళదేవరచెరువు, మే 31(ఆంధ్రజ్యోతి): బియ్యం బండి ఎప్పుడు వస్తుందోనన్న లబ్ధిదారుల ఎదురుచూపులకు ఇక ఫుల్‌స్టాప్ పడనుంది. వారికి అనుకూలమైన సమయంలో వెళ్లి సరుకులు తెచ్చుకోవచ్చు. వైసీపీ ప్రభుత్వంలో రేషన్ సరుకుల పంపిణీ అస్తవ్యస్తంగా ఉండేది. గతంలో రేషన్ బండి ద్వారా ఇంటింటికి సరుకుల సరఫరాకు వాహనాలను ప్రవేశపెట్టారు. వాహనదారులు ఇంటింటికి వెళ్లి బియ్యం పంపిణీ చేయలేదు. కొందరు రెండుమూడురోజులు మాత్రమే పంపిణీ చేసి ముఖం చాటేసిన సంఘటనలు ఉన్నాయి. దీనిపై లబ్ధిదారులు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వం చౌక డిపోలద్వారానే నిత్యావసరాలు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం బియ్యం బండి సరఫరా రద్దు చేయడంతో రూ.కోట్లు ప్రజాధానం ఆదా అయింది. రేషన్ బండి ఎప్పుడోస్తుందో, ఎప్పుడు పోతుందో అన్న ఆందోళన లబ్ధిదారుల్లో ఉండేది. ఆ బండి కోసం పనులు వదులుకుని పడిగాపులు కాయల్సి వచ్చేది. రేషన్ దుకాణల ద్వారా నిత్యవసరాలు పంపిణీకి శ్రీకారం చుట్టడం ద్వారా లబ్ధిదారులకు ఎదురు చూసే పనిలేకుండా పోయింది. ఒంటరి వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దనే రేషన్ ఇచ్చేలా చర్యలు చేపట్టారు. ప్రతినెలా 1నుంచి 15వతేదీ వరకు ప్రభుత్వ చౌకడిపోలు తెరిచే ఉంటాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు బియ్యం పంపిణీ చేస్తారు. దీంతో కూలీలు, రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.



రేషన్ దుకాణానికి చేరిన బియ్యం

కొత్త విధానమే మేలు



ప్రస్తుత ప్రభుత్వం కొత్త విధానంతో రేషన్ సరుకులు పంపిణీ చేయడం చాలా బాగుంది. గతంలో బియ్యం కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం చౌకధాన్యపు దుకాణాల్లో తెచ్చుకోవడానికి ఉదయం, సాయంత్రం అవకాశం కల్పించింది. కొత్త విధానంతో వీలయినప్పుడు వెళ్లి బియ్యం తెచ్చుకోవచ్చు.

- చిన్నబాబు, వీరఓబునపల్లి

పడిగాపులు తప్పాయి



గతంలో రేషన్ బండ్లు వచ్చే వరకు బియ్యం కోసం పడిగాపులు కాయాల్సి ఉండేది. బియ్యం వాహనం ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలిసేది కాదు. ప్రస్తుతం స్టోర్ల వద్దే బియ్యం ఇవ్వడం చాలా బాగుంది. పగటిపూట పనికి వెళ్లినా, సాయంత్రం వచ్చి బియ్యం తెచ్చుకోవడానికి వీలుంటుంది.

-చెరువు కుమారి, నల్లమాడ

పంపిణీకి సిద్ధం

నూతన ప్రజా పంపిణీ విధానానికి చర్యలు చేపట్టాం. మండల వ్యాప్తంగా అన్ని చౌకధాన్యపు డిపోలకు నిత్యవసర వస్తువులు చేరాయి. పంపిణీ సమయాన్ని కచ్చితంగా పాటించాలని డీలర్లను ఆదేశించాం. ఒంటరి వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్లవద్దే రేషన్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

-అనంతాచారి, తహసీల్దార్

ఒక్కరోజు ముందుగానే పింఛన్ల పంపిణీ

కొత్తచెరువు, మే 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రోజు ముందుగానే వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేసింది. శనివారం మండలంలోని నాగిరెడ్డిపల్లి, ఇరగంపల్లి, వంగంపల్లి గ్రామాలలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అధికారులతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు.

అధికారులపై మండిపడ్డ ఎమ్మెల్యే

పంచాయతీ కార్యదర్శులు గ్రామీణ ప్రాంతాల్లో పర్యటిస్తున్నారా లేదా అని ఎంపీడీఓ నటరాజ్‌ను ఎమ్మెల్యే సింధూరారెడ్డి ప్రశ్నించారు. ఇరగంపల్లిలో ఇళ్ల ముందు మురుగునీరు నిల్వ ఉండటంతో అధికారులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఎక్స్‌కవేటర్‌ను తెప్పించి మురుగునీటి గుంతను శుభ్రం చేయించారు.



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, పల్లె రఘునాథరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్‌షాదున్నీసా

● కదిరి: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకరోజు ముందుగా పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్ షాదున్నీషా పేర్కొన్నారు. 20వ వార్డులో లబ్ధిదారుల ఇంటివద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. వైస్ చైర్మన్ సేగ సుధారాణి, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, కౌన్సిలర్ జయమ్మ, నాయకులు బాహావుద్దీన్ పాల్గొన్నారు.

జనరల్ ఫండ్ నుంచి కాంట్రాక్టర్లకు బిల్లులు చేయొద్దు: కౌన్సిలర్లు

ధర్మవరం, మే 31(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ జనరల్ ఫండ్స్ నుంచి కాంట్రాక్టర్లకు బిల్లులు చేయరాదని పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. శనివారం చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయి, గజ్జల శివ, గోరకాటి పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ... మున్సిపల్ స్థలాలకు కంచె, స్తంభాలు నాటిన వివరాలు తెలపాలన్నారు. నాలుగురోజుల్లో సమాచారం ఇస్తామని కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. మున్సిపాలిటీకి సంబంధించి మార్కెట్‌ల్లో ఇంతవరకు రూ.90 లక్షలు బకాయి ఉందని, ఎందుకు వసూలు చేయలేదని ప్రశ్నించారు. గతంలో మార్కెట్ దగ్గర కాయగూరలు, చేపలు మాత్రమే కొనుగోలు చేయాలని తీర్మానం చేశామన్నారు. ఇప్పుడు కాయగూరల మార్కెట్‌కు అవతల మార్కెట్‌లో ఉన్న షాపుల వారికి ఆదాయం లేకుండా పోతోందని బాడుగ కట్టలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. వార్డుల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ స్పందిస్తూ సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో వైస్‌చైర్‌పర్సన్ షంషాద్‌బేగం, ఈఈ సాయికృష్ణ, డీఈ కళావతి, టీపీఆర్ఓ విజయ్‌భాస్కర్, టీపీఓ అలివేలమ్మ, ఆర్వో ఆరీఫ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ నారాయణరెడ్డి

రైతు సేవాకేంద్రాలకు చేరిన వేరుశనగ



నల్లమాడలో వేరుశనగ కాయలను పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

నల్లమాడ, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాలకు సబ్సిడీ విత్తన వేరుశనగ చేరినట్లు ఏఓ శంకర్‌నాయక్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలానికి 3,300 క్వింటాళ్లు అవసరమని ప్రతిపాదనలు పంపగా, ప్రస్తుతం 650 క్వింటాళ్ల చేరినట్లు చెప్పారు. విత్తన వేరుశన కాయలను వ్యవసాయ సిబ్బంది పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాలకు పంపిణీ చేపడతామన్నారు. ఆయనతో పాటు ఎంఈఓలు రాధ, షాన్వాజ్, భాస్కర్‌నాయక్, తదితరులు ఉన్నారు.

● నల్లచెరువు (కదిరి): మండలంలోని రైతు సేవా కేంద్రాలకు శనివారం సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు చేరాయి. మండలానికి కె-6 రకం 1,680 క్వింటాళ్ల ప్రతిపాదనలు పంపినట్లు ఏఓ భారతి తెలిపారు. 400 క్వింటాళ్లు ప్రస్తుతం మండలానికి చేరాయన్నారు. మిగిలిన కాయలు మరో రెండురోజుల్లో వస్తాయన్నారు.

వేధింపులపై కేసు నమోదు

ధర్మవరం, మే 31(ఆంధ్రజ్యోతి): అత్తింటివారు తరచూ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారంటూ కాలవ పల్లవి అనే మహిళ ఫిర్యాదు మేరకు భర్త, అత్త, ఆడపడచులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఆయన మేరకు....పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన కాలవ పల్లవి యాడికి చెందిన జనార్దన్‌తో 14 ఏళ్లక్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత కొన్ని రోజులుగా భర్త, అత్త, ఆడపడచులు అనవసరంగా గొడవ పడుతూ శారీరకంగా, మానసికంగా వేధించడంతోపాటు విడాకులు ఇవ్వాలని లేకపోతే చంపుతామంటూ బెదిరిస్తున్నారని పల్లవి ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

టిప్పర్, ద్విచక్రవాహనం ఢీ : వ్యక్తి మృతి



గాండ్లపెంట, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరి, రాయచోటి ప్రధాన రహదారిలోని కటారుపల్లి క్రాస్ వద్ద టిప్పర్, ద్విచక్రవాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గాండ్లపెంట నుంచి జురుకువాండ్లపల్లికి ద్విచక్రవాహనంలో ప్రసాద్ (36) వెళ్తున్నారు. కదిరి నుంచి గాండ్లపెంటకు టిప్పర్ వస్తుండగా మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్న ప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు సంఘటనాస్థలాన్నిపరిశీలించారు. మృతుడు ముదిగుబ్బ మండలానికి చెందిన వ్యక్తి అని, భార్య పుట్టినిల్లు జురుకువాండ్లపల్లికి వచ్చారని తెలిపారు. పిల్లలకు తినుబండారులు తీసుకురావడానికి గాండ్లపెంటకు వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగిందన్నారు. మృతుడికి భార్య శ్రావణి, మూడు సంవత్సరాల కుమారుడు, 14నెలల పాప ఉన్నట్లుచెప్పారు.

కదిరి వద్ద విశ్రాంత ఉద్యోగి..

● కదిరి: మండలంలోని మాచిరెడ్డిపల్లికి చెందిన జెరిపిటి లక్ష్మణ (68) అనే విశ్రాంతి రైల్వే ఉద్యోగి ప్రమాదంలో మృతి చెందారు. పింఛన్ డబ్బులు డ్రా చేసుకోవడానికి ద్విచక్రవాహనంలో కదిరికి వస్తున్నారు. కదిరి నుంచి అనంతపురం వైపు వెళ్తున్న టిప్పర్ పీవీఆర్ బార్ వద్ద వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో లక్ష్మణకు తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు ధనుంజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

తాగునీరు సరఫరా

ఓబుళదేవరచెరువు, మే31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయనకోట తండాలో పైపులైన్ మరమ్మతుల కారణంగా తాగునీటి సమస్య ఏర్పడింది. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆదేశాల మేరకు బిసిసెల్ నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు తాగునీటి నివారణకు చర్యలుచేపట్టారు. సొంత నిధులతో నీటి ట్యాంకర్‌తో సరఫరా చేశారు.

అక్రమ నిర్మాణాలు ఆపండి

- సమావేశంలో కౌన్సిలర్ల డిమాండ్

కదిరి, మే 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అనుతులు లేకుండా నిర్మిస్తున్న నిర్మాణాలను ఆపాలని పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ దిల్ షాద్‌దున్నీసా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మొదట ఆజెండా ను ఆమోదించారు. అందులో కొన్నింటిని సభ్యులు తిరస్కరించారు. కొన్నింటిని వాయిదా వేశారు. అనంతరం 24వ వార్డు కౌన్సిలర్ అల్పాముస్తఫా మాట్లాడుతూ.. తనవార్డులో ప్రభుత్వ భూమి ఆక్రమించుకుని మూడంతస్థుల భవనం నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. స్పందించిన కమిషనర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఇప్పటికే పలుమార్లు నో టీసులు ఇచ్చామని, కోర్టుకు కేసు వేస్తున్నామన్నారు. ఈనెల 25న అక్కడ జరుగుతున్న పనులు ఆపివేసి, నిర్మాణ సామగ్రిని కూడా తీసుకొచ్చామన్నారు. వైస్ చైర్మన్ రాజశేఖరఆచారి కల్పించుకుని ప్రతిదీ కేసులతో పరిష్కారం కాదని, అక్రమ నిర్మాణాలను వెంటనే ఆపాలని సూచించారు. 26వ వార్డు కౌన్సిలర్ పయాజ్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో మురుగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మూర్తిపల్లిలో సచివాలయం మార్చకుండా గతంలో ఉన్న చోటే కొనసాగించాలన్నారు. 12వ వార్డు కౌన్సిలర్ ఖాసీం మాట్లాడుతూ.. రాయచోటిరోడ్డు నుంచి నానా దర్గా వరకు ఉన్న పెద్దకాలువలో మురుగు తొలగించాలన్నారు. జగనన్న కాలనీ పేరు మార్చకుండా చూడాలని 29వ వార్డు కౌన్సిలర్ షబ్బీర్ కమిషనర్‌ను కోరారు. పలువురు కౌన్సిలర్లు వార్డు సమస్యలను తెలిపారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ సేగు సుధారాణితోపాటు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు, మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దిల్‌షాదున్నిసా

రిలే దీక్షల విరమణ



ప్లంబర్లకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న డిప్యూటీ తహసీల్దార్

ధర్మవరం, మే 31(ఆంధ్రజ్యోతి): దొంగపట్టాలను రద్దు చేస్తామని డిప్యూటీ తహసీల్దార్ సురేశ్‌బాబు తెలిపారు. 650-2లో అవినీతి, అక్రమాలను విచారణ చేపట్టాలని 11 రోజులుగా చేపడుతున్న రిలేదీక్షలను శనివారం ఆయన నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.650-2 సర్వేనెంబరులో అనర్హులైన వారి పట్టాలను రద్దు చేసి నిజమైన కార్మికులకు వెంటనే పట్టాలు మంజూరుచేస్తామని తెలిపారు. సీపీఐ నియోజకవర్గకార్యదర్శి మునుగు మధు మాట్లాడుతూ.. 650-2లో అన్యాక్రాంతం చేసిన వారిపై 420 కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమణ, వెంకటస్వామి, రవికుమార్, గోవిందరాజులు, లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, ఆదినారాయణ, తాజుద్దీన్, రామకృష్ణ, రామసుబ్బయ్య, మసూద్, సురేంద్ర పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తలతో కలిసి పింఛన్ల పంపిణీ

తనకల్లు, మే 31(ఆంధ్రజ్యోతి): ఈతోడు గ్రామ సర్వేయర్ షెక్షావలిపై టీడీపీ కార్యకర్తలు శనివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. సర్వేయర్ వైసీపీ కార్యకర్తలతో కలిసి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఆరోపించారు. టీడీపీ కార్యకర్తలను పట్టించుకోకపోగా, కనీస మర్యాదకూడా ఇవ్వడంలేదన్నారు. ఈ విషయం మానుకోవాలని సర్వేయర్‌కు చెప్పినా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు వివరించారు. సర్వేయర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.



వైసీపీ కార్యకర్తలతో కలిసి పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్వేయర్ షెక్షావలి

యోగాంధ్రను విజయవంతం చేయండి

ధర్మవరం, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతమయ్యేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆర్డీఓ మహేశ్ తెలిపారు. స్థానిక ఆర్డీఓ చాంబర్‌లో శనివారం అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురష్కరించుకుని జూన్ 10న ధర్మవరంలో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, నిర్వహణ గురించి పలు శాఖలకు సంబంధించిన అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో డీఎస్పీ హేమంత్ కుమార్, డీఎల్‌పీఓ శివకుమారి, మున్సిపల్ మేనేజర్ రాజేశ్వరిబాయి, ఎంపీడీఓ, ఎంఈఓలు, సీడీపీఓలు, డ్వామా, డీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు రహదారి ఏర్పాటు చేయాలి

కదిరిఅర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరవాండ్లపల్లి వద్ద కదిరి కొండ చుట్టూ గిరిప్రదక్షిణకు రహదారి ఏర్పాటు చేయాలని శనివారం విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో ఆర్డీవో వీవీఎస్ శర్మకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో కుమ్మరవాండ్లపల్లివద్ద కొండలో చెంచులక్ష్మీనరసింహస్వామి సమేతంగా వెలిశారన్నారు. ఈ క్షేత్రానికి ఖాద్రీపురమని పేరువచ్చిందని భక్తుల విశ్వాసమన్నారు. నరసింహస్వామి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం రోజులు భక్తులు పెద్ద ఎత్తున కదిరికొండకు గిరిప్రదక్షిణ చేస్తున్నారన్నారు. కొండచుట్టు రహదారి లేకపోవడంతో భక్తులు ఇబ్బంది పడతున్నారని, గిరిప్రదక్షిణకు అనుకూలంగా రహదారి ఏర్పాటుచేయాలని కోరారు.

జాబ్‌మేళాకు 17 మంది ఎంపిక

ధర్మవరం, మే 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలలో 17 మంది ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ మునల్‌రెడ్డి తెలిపారు. ఈ జాబ్‌మేళాలలో కె.ఎల్ గ్రూప్స్(అమేజాన్ వేర్ హౌస్‌మేనేజ్‌మెంట్) తరఫున రఘునాథరెడ్డి, ఆల్ డిజీ టెక్నికల్ సపోర్ట్ తరఫున ఇర్షాద్‌అహమ్మద్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. 78 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించగా కేఎల్ గ్రూప్స్‌నకు 11 మంది, ఆల్‌డిజీ టెక్నికల్ సపోర్ట్‌కు ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. జామ్‌మేళాకు ఎంపికైన విద్యార్థులను బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె వెంకటకిశోర్, ప్రిన్సిపాల్ మునల్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

గ్రామాల్లో పోలీసుల తనిఖీలు



సీబీఎన్ కాలనీలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తనకల్లు, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కంటి క్రాస్ సమీపంలోని చంద్రబాబుకాలనీలోని కదిరి రూరల్ సీఐ నాగేంద్ర ఆధ్వర్యంలో నల్లచెరువు, ఎన్పీకుంట, తనకల్లు ఎస్ఐలు సిబ్బంది శనివారం ఉదయం తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎక్సైజ్ కేసులో నిందితులుగా ఉన్న అనుమానితుల ఇళ్లను తనిఖీలు చేశారు. తదుపరి నేరాల్లో పాల్గొనకూడదని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో సమావేశం నిర్వహించారు. మహిళలు, పిల్లలపై నేరాలు, ఎస్టీ,ఎస్సీలపై జరిగే అణచివేత నేరాలు, రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. అనుమానాస్పంద, అక్రమకార్యకలాపాలుంటే వెంటనే పోలీసులకు తెలపాలన్నారు. ఎస్ఐ గోపి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

6న బసవేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం


మాట్లాడుతున్న వీరభద్ర శివాచార్య స్వామి

అమరాపురం, మే 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బసవేశ్వర ఆలయ 19వ వార్షికోత్సవం 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు వీరభద్ర శివాచార్య స్వామి శనివారం తెలిపారు. కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లా కొరటగెరె తాలూకా సిద్దబెట్ట శివాచార్యస్వామి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. వార్షికోత్సవంతో పాటు సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు స్వామి తెలిపారు. ప్రజలు, భక్తులు, పెద్దఎత్తున హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. డాక్టర్ బసవరాజు, శివకుమార్, శివరుద్రప్ప, హైటెక్‌బాబు, ఆరాధ్య, ఉమాపతి, మబంజునాథ్ పాల్గొన్నారు.

తూనికల్లో అవకతవకలకు పాల్పడవద్దు


రేషన్ షాపులో డిజిటల్ స్కేల్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

చిలమత్తూరు, మే 31(ఆంధ్రజ్యోతి): పేదలకు అందించే రేషన్ సరుకుల తూనికల్లో అవకతవకలకు పాల్పడరాదని జిల్లా తూనికలు కొలతల శాఖ అధికారి సుధాకర్ సూచించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎఫ్‌పీ షాపుల డిజిటల్ స్కేళ్లను ఆయన తనిఖీ చేశారు. తూనికల్లో తేడాలు ఉన్న వాటిని అప్‌డేట్ చేశారు. ఇంతవరకు రేషన్ సరుకులను ఎండీయూ ఆపరేటర్ల ద్వారా లబ్ధిదారులకు అందేవని, ప్రస్తుతం నేరుగా డీలర్ల ద్వారా అందుతాయన్నారు. దాంతో సరుకులు అందజేసే డిజిటల్ స్కేళ్లను అప్‌డేట్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి డీలరు లబ్ధిదారులకు సక్రమంగా సరైన తూకాలతో సరుకులు అందజేయాలన్నారు. ఎవరైనా తూకాల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పొగతో ఆరోగ్యం నాశనం


ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

హిందూపురం, మే 31(ఆంధ్రజ్యోతి): పొగ తాగడంవల్ల ఆరోగ్యం నాశనమవుతుందని వైద్యులు తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం హిందూపురంలో దంత వైద్యులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి దంత వైద్యుడు విజయ్‌బాబు, సురేఖదేవి మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులపై యువత, ప్రజల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. పొగాకు వాడటం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. వైద్యులు జక్కనరేంద్ర, చరణ్, మోహన్‌బాబు, అపర్ణ, రమ్య, భరత్, శ్రీనివాస్, లోకేష్, చైతన్య పాల్గొన్నారు.

తాత్కాలికంగా రోడ్డు వేయించిన ఎమ్మెల్యే

రొళ్ల, మే 31(ఆంధ్రజ్యోతి): మల్లినమడుగులో రోడ్డు బురదమయం కావడంతో ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు స్పందించి శనివారం తాత్కాలికంగా రోడ్డు పనులను చేయిస్తున్నారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పరిగిలో చోరీ


బీరువా పగలకొట్టిన దుండగులు

పరిగి, మే 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పైడేటి బస్టాండు సమీపంలో ఉన్న ఆదినారాయణరెడ్డి ఇంట్లో శుక్రవారం రాత్రి దొంగలు పడ్డారు. చిత్తూరులోని కుమార్తె జన్మదిన వేడుకలకు కుటుంబ సభ్యులతో కలిసి ఆదినారాణరెడ్డి వెళ్లారు. తాళం వేసిన ఇంట్లో దొంగలుపడి బీరువా పగలకొట్టి అందులో ఉన్న ఐదు తులాల బంగారం, 1.5కేజీల వెండి, రూ.5వేలు నగదును దొంగలు దోచుకెళ్లారు. శనివారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు, ఇంటి యజమానులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఆదినారాయణరెడ్డి ఇంటికిచేరుకుని పరిశీలించగా చోరీకి గురైనట్లు గుర్తించారు. పోలీసులు, క్లూస్‌టీమ్ వచ్చి వివరాలను సేకరించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సోమందేపల్లి, మే 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నల్లగొండ్రాయనపల్లి సమీపంలో జాతీయరహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వడ్డెమారప్ప అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సోమందేపల్లి డీఎల్‌రోడ్డులో నివాసముంటున్న వడ్డెమారప్పకు కొంతకాలం క్రితం భార్య మృతిచెందడం, సంతానం లేకపోవడంతో నిలకడలేక అటూ ఇటూ తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో జాతీయరహదారి దాటుతుండగా అనంతపురం-బెంగళూరు వైపు వెళ్తున్న ఐచర్ వేగంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉచిత కంటి శస్త్రచికిత్సలు

పావగడ, మే 31(ఆంధ్రజ్యోతి): స్థానిక శారదాదేవి కంటి ఆసుపత్రిలో రామక్రిష్ణ సేవాశ్రమ పీఠాధిపతి జపానంద స్వామి రోగులకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తున్నారు. 60ఏళ్ల పైబడి వృద్ధులు అధికంగా జపానంద స్వామి ఆసుపత్రికి వస్తుంటారు. శారదాకంటి ఆసుపత్రి, రామక్రిష్ణ సేవాశ్రమ ఇన్ఫోసిస్ సంస్థ అండతో పేదలకు ఎన్నో ఉచిత సేవలు అందించడానికి ఇన్ఫోసిస్ సంస్థ అధినేత సుధామూర్తి నిధులు కల్పిస్తున్నారు. వీరి సహాయంతో వృద్ధులకు ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేయిస్తున్నారు.

కోటి మందికి ఉచిత గ్యాస్ సిలిండర్లు: మంత్రి సవిత


టీ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కోటి మందికి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని మంత్రి సవిత అన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా శనివారం మంత్రి స్వతహాగా టీ చేశారు. పట్టణంలోని న్యూకాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ క్రమంలో ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించి ఇంట్లో గ్యాస్ పొయ్యి వెలిగించి పాలుపోసి టీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కోటి మందికి ఉచిత గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వం అందిస్తోందన్నారు. జూన్ 12న 71,380 కొత్త పింఛన్లు అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం 2.7 కోట్ల మందికి పింఛన్లు అందిస్తున్నామన్నారు. ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు, అన్నదాత సుఖీభవ, తల్లికివందనం పథకాలు అమలు చేస్తామన్నారు.

సైకిల్‌యాత్ర విజయవంతం: కడపలో జరిగిన మహానాడు కార్యక్రమానికి పెనుకొండ నుంచి యువగళం సభ్యులు 44మంది సైకిల్‌యాత్రగా వెళ్లారు. ఈ కార్యక్రమం విజయవంతం అయిందని మంత్రి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సైకిల్‌యాత్ర చేసిన కార్యకర్తలకు శాలువకప్పి సత్కరించారు. మంత్రి మాట్లాడుతూ సైకిల్‌యాత్రలో పాల్గొన్నవారికి మంత్రి లోకేశ్ కలవాలనుకున్నారని సమయాభావంతో కలవలేదన్నారు. అనంతరం కేక్ కట్‌చేసి సభ్యులకు పంచిపెట్టారు. కేశవయ్య, శ్రీరాములు, ప్రసాద్, నారాయణస్వామి, షౌకత్, రఘు, రమణమ్మ, చంద్రకాంతమ్మ, రామక్రిష్ణ, పాల్గొన్నారు.

పాములుపట్టే కుటుంబాలకు ఇల్లు మంజూరు చేస్తాం

హిందూపురం(రొద్దం): నారనాగేపల్లి గ్రామంలో 50ఏళ్లుగా ఇల్లులేక పూరిగుడిసెలో నివాసముంటున్న పాములుపట్టే కుటుంబాలకు మంత్రి సవిత ఇళ్ల మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. శనివారం రొద్దం మండల నారనాగేపల్లి గ్రామంలో పింఛన్ల పంపిణీలో మంత్రి పాల్గొన్నారు. పాములుపట్టి జీవనం సాగించే కుటుంబాలు అత్యంత దుర్భర స్థితిలో జీవితాన్ని అనుభవిస్తుండగా మంత్రి వారి కుటంబ సభ్యులతో మాట్లాడారు. ఇన్నేళ్లుగా ఎందుకు ఇల్లు కట్టుకోలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో స్థానిక నాయకులు నా ఇంటి బిల్లులు కాజేశారని, ఇప్పుడు ఇల్లు మంజూరు కావడం లేదని మంత్రితో వాపోయారు. ప్రభుత్వంతో మాట్లాడి ఇల్లు మంజూరుకు చర్యలు తీసుకుంటానన్నా రు. ఎవరైనా పాముకాటుకు గురైతే ఉచితంగా మందు ఇచ్చి ఎంతో మంది ప్రాణాలు కాపాడారని మంత్రికి స్థానిక నాయకులు వివరించారు.


పాములు పట్టే మహిళతో మాట్లాడుతున్న మంత్రి సవిత

సామాజిక చైతన్యంతోనే సమాజంలో మార్పు: ఎస్పీ

మడకశిర టౌన్, మే31(ఆంధ్రజ్యోతి): సామాజిక చైతన్యంతోనే సమాజంలో మార్పు అని, మూఢనమ్మకాలను పారదోలాలనని అందుకు మడకశిర నుంచి శ్రీకారం చుట్టాలని ఎస్పీ వి.రత్న అన్నారు. శనివారం బుళ్ళసముద్రం గ్రామంలో జరిగిన పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు, అధునిక యుగంలో కూడా సామాజిక అంతరాలు, మూఢనమ్మకాలు అక్కడక్కడ కొనసాగుతుండడం బాధాకరమన్నారు. ఒక గొప్ప మార్పుకు మడకశిర నుంచి శ్రీకారం చుట్టుదామన్నారు. ఈ ప్రాంతంతో అక్కడక్కడ రెండు గ్లాసుల పద్ధతి కొనసాగుతుండడం మంచిదికాదన్నారు. ప్రాథమిక హక్కుల్లో స్వేచ్ఛ, సమానత్వం ముఖ్యమైనవన్నారు. ఈ హక్కులను కాపాడినప్పుడే ప్రతి ఒక్కరిలో చైతన్యం వస్తుందన్నారు. జిల్లాలో బాల్యవివాహాలను నియంత్రించడంతో పాటు మహిళలపై అఘాయిత్యాలను అరికట్టేందుకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. సాంఘిక వివక్షలను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ కృషివల్లే అనేక హక్కులు పొందామన్నారు. జిల్లాలో మహిళలు, చిన్న పిల్లలు, బలహీన వర్గాలపై ఎలాంటి దాడులు జరిగినా చట్టరీత్యా కఠినంగా శిక్షిస్తామన్నారు. తహసీల్దార్ కరుణాకర్, సీడీపీఓ నాగమల్లేశ్వరి, సీఐలు నాగేష్‌బాబు, రాజ్‌కుమార్, సర్పంచ్ రంగమ్మ పాల్గొన్నారు.


పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్పీ రత్న తదితరులు

శాంతియుతంగా జీవించండి: డీఎస్పీ


ఎస్సీ కాలనీ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ మహేష్

చిలమత్తూరు, మే 31(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఘర్షణలు, గలాటాలు లేకుండా శాంతియుతంగా జీవించాలని ప్రజలకు హిందూపురం డీఎస్పీ మహేష్ సూచించారు. మండలంలోని దేమకేతేపల్లి ఎస్సీ కాలనీలో శనివారం సివిల్ రైట్స్ డే కార్యక్రమం చేపట్టారు. ఆయనతో పాటు ఎస్ఐ మునీర్ అహమ్మద్ గ్రామస్థులతో సమావేశమై స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అల్లర్లు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంటే ప్రశాంతత నెలకొంటుందన్నారు. దొంగతనాలు అక్కడక్కడ జరుగుతున్నాయని, వాటిపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరించినా, అనుమానాస్పదంగా ఎవరైనా తిరుగుతున్నా వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

డైమండ్‌బాబాకు పురస్కారం


డైమండ్‌బాబాను సత్కరిస్తున్న ముస్లిం మతపెద్దలు

హిందూపురం, మే 31(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు హజ్‌కమిటీ డైరెక్టర్ డైమండ్‌బాబాకు టిప్పుసుల్తాన్ సామాజిక సేవా పురస్కారాన్ని శనివారం అందజేశారు. జామియా మసీదు కార్యాలయంలో టిప్పుసుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు ఉమర్‌ఫారూక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందించారు. ముతువల్లి నూరుల్లాఖాన్, అజ్మతుల్లా, పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల నియామకం

గుడిబండ, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులను నియమించారు. రాళ్లపల్లి పాఠశాలకు శ్యామన్, ఎస్‌రాయపురంకు సుజాత, జమ్మలబండకు బయపరెడ్డి, పీసీగిరికి శ్రీకాంత్‌రెడ్డి, కేఎన్ పల్లికి వేణుగోపాల్, కేకేపాళ్యంకు రామానాయుడు, మందలపల్లికి మల్లికార్జున, గుడిబండకు గోవిందప్ప, మోరుబాగల్‌కు వెంకటరమణారెడ్డిలను ఉన్నతాధికారులు నియమించారు.

ప్రతి ఒక్కరూ హక్కులు తెలుసుకోవాలి


అమరాపురంలో మాట్లాడుతున్న ఎస్ఐ ఇషాక్‌బాషా

లేపాక్షి, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమహక్కులు తెలుసుకుని సంఘంలో గౌరవంగా జీవించాలని తహసీల్దార్ సౌజన్యలక్ష్మి అన్నారు. శనివారం పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా బిసలమానేపల్లి పంచాయతీ రాజీవ్‌కాలనీలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సంఘంలో ఎవరినీ కించపరచకుండా ప్రతి ఒక్కరూ సమానహక్కులతో జీవించాలన్నారు. అనంతరం కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్, రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పరిగి: ఊటకూరు సచివాలయంలో శనివారం పౌరహక్కులపై ఎస్సీఎస్టీ హస్టల్ వార్డన్ వీరనారాయణ అవగాహన కల్పించారు. పలువురు మాట్లాడుతూ పౌరహక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకుని అధికారుల ఒత్తిళ్లకు లోబడకుండా తమ హక్కులను వినియోగించుకోవాలన్నారు. తహసీల్దార్ హసీనాసుల్తానా, ఎస్ఐ రంగడుయాదవ్, ఎస్సీఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు రామాంజి, జడ్పీటీసీ శ్రీరాములు పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలోని ఆరోనపల్లిలో సర్పంచ్ భాగ్యమ్మ అధ్యక్షతన పౌరహక్కులపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్ఐ ఇషాక్‌బాషా, ఏఎస్ఐ రామాంజనేయులు, సీనియర్ అసిస్టెంట్ రజితకుమారి, వీఆర్‌ఓ శివన్న పాల్గొని పౌరహక్కులపై ప్రజలకు అవగాన కల్పించారు. గ్రామస్థులు చంద్రశేఖర్‌నాయక్, డీలర్ మోహన్‌కుమార్, ప్రజలు పాల్గొన్నారు.

గోరంట్ల: మండలంలోని కొండాపురం గ్రామంలో పౌర హక్కులపై అధికారులు శనివారం అవగాహన కల్పించారు. పౌరహక్కులదినోత్సవం సందర్భంగా కొండాపురంఎస్సీకాలనీలో సమావేశం నిర్వహించారు. పౌరహక్కులు, అంటరానితనం, రెండుగ్లాసుల పద్ధతి చట్టరీత్యా నేరమని, అలాంటి వాటికి పాల్పడినవారిపై చర్యలు చేపడతామన్నారు. తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ నరేంద్రకుమార్, ఎస్సీఎస్టీ మానటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసనాయక్, డివిజన్ కమిటీ సభ్యులు గంగాధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


కొండాపురంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మారుతి

ప్రజలకు చేరువకాని ఆర్టీసీ సేవలు

- 20 ఏళ్లుగా నిరుపయోగంగా బస్టాండు
- ఆసక్తి చూపని ప్రయాణికులు

సోమందేపల్లి, మే 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొత్త హైస్కూల్ పక్కన 20ఏళ్ల క్రితం రూ.లక్షల ప్రజాధనం వెచ్చించి రెండెకరాల స్థలంలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండు సేవలు ఇప్పటి వరకు ప్రజలకు చేరువకాలేదు. అధికారులు బస్సులు బస్టాండులో ఆగేలా చర్యలు చేపట్టారు. అడపాదడపా కొన్ని బస్సులు బస్టాండులోకి వచ్చి వెళ్తున్నా ఆశించిన మేర ఫలితాలు దక్కడంలేదు. పెద్దమ్మగుడివద్ద ప్రయాణికులు అక్కడినుంచే ప్రయాణించడానికి సుముఖత చూపుతుండటంతో ఆర్టీసీ అధికారుల ప్రయత్నం ఫలించడంలేదు. గతంలో బస్టాండు నిర్మాణం ఊరికి వెలుపల చేపట్టారు. అప్పట్లో దూరాభారం రీత్యా బస్టాండును ప్రయణికులు వినియోగించుకోలేదని ప్రస్తుతం పరిస్థితి మారింది. గ్రామం అభివృద్ధి చెందింది. బస్టాండు చుట్టుపక్కల కాలనీలు, వాణిజ్య సముదాయాలు ఉన్నాయని పట్టణం బాగా అభివృద్ధి చెందింది. అయినా ప్రజలు బస్టాండులోకి వచ్చి ఆర్టీసీ సేవలు వినియోగించుకోలేకపోతున్నారు. వృథాగా ఉన్న బస్టాండును, పరిసరాలను అధికారులు శుభ్రంచేశారు. ప్రతి బస్సు ఆర్టీసీ బస్టాండుకు వచ్చేలా కంట్రోలర్ చర్యలు తీసుకున్నారు. బస్సులు బస్టాండుకు వస్తున్నా ప్రజలు మాత్రం అక్కడకు రావడంలేదు. ప్రజలు ఆర్టీసీ సేవలు వినియోగించుకునేలా అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదేవిధంగా పట్టణ ప్రముఖులు, స్థానిక నేతలు ప్రజలను బస్టాండు వినియోగించుకునేందుకు అవగాహన కల్పించాలి.


ప్రయాణికులు లేక బోసిపోయిన ఆర్టీసీ బస్టాండు


సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

సీఎంఆర్ఎఫ్.. పేదలకు వరం: ఎమ్మెల్యే

మడకశిర టౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ అవరణలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమలతిప్పేస్వామితో కలసి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. 15మంది లబ్ధిదారులకు రూ.9.68 లక్షల అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలో, నియోజకవర్గంలో దండుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజలకు చేసిన మేలు శూన్యం అన్నారు. గత ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో ఏ ఒక్క పెదవాడికి సహాయం చేసింది లేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధి గురించి పూర్తిగా మరిచారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే అటు అభివృద్ధి ఇటు సంక్షేమం దిశగా ముందుకెళుతున్నామన్నారు. రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి, నాయకులు డాక్టర్ క్రిష్ణమూర్తి, కన్వీనర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనవైపు యువత సాగాలి

ఆధ్యాత్మిక చింతనవైపు యువత సాగాలని, మడకశిర సరిహద్దు ప్రాంతం అత్యంత ప్రసిద్ధిగాంచిన సిద్దరబెట్ట పుణ్యక్షేత్రంలో 8వతేదీన జరిగే ఉచిత సామూహిక వివాహాలకు నియోజకవర్గం నుంచి దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు కోరారు. శనివారం పట్టణంలోని బాలాజీనగర్‌లో శ్రీక్షేత్ర సిద్దర బెట్ట బ్రహ్మ వీరభద్ర శివాచార్యస్వామి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమలతిప్పేస్వామిలతో కలసి ఉచిత వివాహ పోస్టర్లను విడుదల చేశారు. వీరభద్రశివాచార్యస్వామి వారు మాట్లాడుతూ రోజురోజుకు మానవతా విలువలు తగ్గిపోతున్నాయని, మానవునిలో ఈర్ష్యాద్వేషం, అసూయ పెరిగిపోతున్నాయన్నారు. యువతను ఆధ్యాత్మిక చింతన వైపు నడపాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ సిద్దరబెట్ట పుణ్యక్షేత్రంలో 19వ వార్షికోత్సవంలో భాగంగా 8న మహారుద్రా భిషేకం, బిల్వార్చన, ఉచిత సామూహిక వివాహ కార్యక్రమాలు వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ


పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

రొళ్ల, మే 31(ఆంధ్రజ్యోతి): మండలం దాసప్పపాళ్యం, గుట్టగురికి గ్రామాల్లో ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఒకరోజు ముందే పండుటాకులకు పింఛన్లను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటీగ వక్కళిగ సాధికార సమితి కన్వీనర్ వీఎం పాండురంగప్ప, మండల కన్వీనర్ దాసిరెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి, క్లస్టర్ ఇన్‌చార్జి భరత్, కార్యదర్శి ఈరన్న, నాగరాజు, హేమంత్, మారుతి, రామక్రిష్ణ, శీనప్ప, శ్రీనివాసులు, గోవిందప్ప, పాండురంగప్ప, రామచంద్రప్ప పాల్గొన్నారు.

సోమందేపల్లి: మండలంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు కార్యక్రమాన్ని అధికారులు, నాయకులు చేపట్టారు. 1వ తేదీ ఆదివారం కావడంతో ముందస్తుగా పింఛన్లు పంపిణీ చేపట్టినట్లు ఎంపీడీఓ వెంకటలక్ష్మి తెలిపారు. ఉదయం 6నుంచి అధికారులు, నాయకులు, సచివాలయ ఉద్యోగులు లబ్దిదారుల ఇంటివద్దకు వెళ్లి పింఛన్లు అందజేశారు. సాయంత్రానికి 96శాతం పింఛన్ల పంపిణీ జరిగినట్లు తెలిపారు. నాయకులు నీరుగంటి చంద్ర, కన్వీనర్ వెంకటేశ్వర్లు, సూరీ, ఆకుల రమణ, కిష్టప్ప, సూర్యనారాయణ పాల్గొన్నారు.

అగళి, : ప్రతి లబ్ధిదారుడికి పింఛన్ అందించాలని జడ్పీటీసీ ఉమేష్ సచివాలయ సిబ్బందికి, అధికారులకు సూచించారు. శనివారం ఉదయం 8గంటల నుంచి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంబించామన్నారు. మండల వ్యాప్తంగా 5,208 పింఛన్‌దారులకు రూ.2.20కోట్లు మంజూరైందన్నారు. అర్హతగల ప్రతి ఒక్కరికి పింఛన్ అందాలన్నారు.

ఫిర్యాదులు వస్తే వెంటనే పరిష్కరించండి

- మున్సిపల్ చైర్మన్ రమేష్


డ్రైనేజీని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, నాయకులు

హిందూపురం, మే 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వార్డుల్లో ప్రజలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. శనివారం పట్టణంలోని 32వ వార్డులో ఎమ్మెల్యే వీఏ వీరయ్య, టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావుతో కలిసి చైర్మన్ పర్యటించారు. ఆ ప్రాంతంలోని ప్రజలు తాగునీటి సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లారు. నెలలో రెండుసార్లు మాత్రమే నీరు వదులుతున్నారన్నారు. అంతేకాక పరిగి రోడ్డు సమీపంలో పశుగోశాల ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోందని, వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, వీధి దీపాలపై ఆరాతీశారు. కాలువలను శుభ్రంచేసి కాలువపై బ్రిడ్జి ఏర్పాటు చేయాలన్నారు. కమిషనర్ శ్రీనివాసులు, ఏఈ శంకర్, ట్రాన్స్‌కో ఏఈ, అధికారులు, నాయకులు నాగరాజు, కిరోసిన్ బాబు, రాజు, అయూబ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి: పట్టణంలో పారిశుధ్యంపై అధికారులు, సిబ్బంది దృష్టిసారించాలని ఎమ్మెల్యే వీఏ వీరయ్య అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్ మెరుగుపై సంబంధిత విభాగం అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. చైర్మన్ రమేష్, వీరయ్య మాట్లాడుతూ డ్రైనేజీని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. చెత్తను ఏరోజుకారోజు డంపింగ్‌కు తరలించాలన్నారు. అవసరమైతే పారిశుధ్య కార్మికులను అదనంగా తీసుకోవడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఎంహెచ్‌ఓ శోభన్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నిజాముద్దీన్, శంకర్ పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత


యోగాసనాలు వేస్తున్న అధికారులు, ప్రజలు, విద్యార్థులు

లేపాక్షి, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యోగాసనాలు చేయడంవల్ల మానసిక ప్రశాంతతోపాటు ఆరోగ్యంగా జీవిస్తారని తహసీల్దార్ సౌజన్యలక్ష్మి అన్నారు. ప్రతి రోజూ యోగాను నిత్య జీవితంలో భాగం కావాలని ఆమె అన్నారు. 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రతిరోజూ ఉదయం 6-7గంటల వరకు యోగాసనాలు వేస్తున్నారు. శనివారం లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో యోగాసనాలు వేశారు.